నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 15-2-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 161 | పేజీలు: 4 | వెల: రూ.1/-

ఫెడరల్ వ్యవస్థను రక్షించుకుందాం.. సీఎం కేసీఆర్‌తో మాట్లాడిన బెంగాల్ సీఎం

కోల్‌కతా, ఫిబ్రవరి 14:: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇవాళ తెలంగాణ సీఎం కేసీఆర్‌తో మాట్లాడారు. దేశ సమాఖ్యా స్ఫూర్తిని పరిరక్షించుకోవాలని ఈ సందర్భంగా ఆమె అన్నారు. బెంగాల్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ జయభేరీ మోగించింది. ఈ నేపథ్యంలో ఆమె మాట్లాడారు. సాధారణ ప్రజల బాగు కోసం వినమ్రంగా కలిసి పనిచేయాలని దీదీ పిలుపునిచ్చారు. యూపీ ఎన్నికల్లో టీఎంసీ బరిలోకి దిగలేదని, చాలా విశాలమైన ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు. వారణాసిలో మార్చి 3వ తేదీన జరగనున్న ర్యాలీలో పాల్గొనున్నట్లు దీదీ చెప్పారు. కాంగ్రెస్‌తో ఏ ప్రాంతీయ పార్టీకి కూడా సక్రమైన సంబంధాలు లేవని, ఆ పార్టీ తనదైన శైలిలో వెళ్తుందని, తమ పార్టీ కూడా తమదైన శైలిలోనే వెళ్తోందని ఆమె అన్నారు. సమాఖ్యా ప్రభుత్వం ఏర్పాటు విషయంలో అందరి సహకారం అవసరమని దీదీ తెలిపారు. ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, తెలంగాణ సీఎం కేసీఆర్‌తో తాను మాట్లాడినట్లు మమతా బెనర్జీ తెలిపారు.

తెలంగాణ దయాదాక్షిణ్యాలపై కేంద్రం నడుస్తోంది-మంత్రి తలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 14:తెలంగాణకి ప్రధాని మోడీ ఏం చేశారని ప్రశ్నించారు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. రోజుకు నాలుగైదు డ్రెస్సులు వేసుకుని ఫ్యాషన్ షో చేయడమే ఆయన పని అని అన్నారు. మీ జీవితం ఎప్పుడూ.. హిందుస్తాన్, పాకిస్తానేనా.. అని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని తలసాని వార్నింగ్ ఇచ్చారు. మూడేళ్లలో నిన్ను గెలిపించిన సికింద్రాబాద్ లో ఒక లక్ష రూపాయలు పని చేశారా..అని ప్రశ్నించారు. హైదరాబాద్ వరదలప్పుడు కూడా పొలిటికల్ డ్రామాలు చేశారని విమర్శించారు. మీ ఇంకో బీజేపీ ఎంపీ బండిపోతే .. బండి ఇస్తా అన్నాడు కానీ ఒక రూపాయి అయినా ఇచ్చారా.. అని విమర్శించారు. కిషన్ రెడ్డి ఎన్ని నిధులు తీసుకువచ్చారు అని నిలదీశారు. మీ శక్తి ఎంత మా ముందట అని అన్నారు. మిమ్మల్ని ఎందుకు గెలిపించామని సికింద్రాబాద్ ప్రజలు అనుకుంటున్నారని తలసాని అన్నారు. గతంలో ఐటీఐఆర్ ని యూపీఏ గవర్నమెంట్ ఇస్తే? బీజేపీ రద్దు చేసిందన్నారు. తెలంగాణ దయాదాక్షిణ్యాలపైనే కేంద్రం నడుస్తున్న విషయాన్ని మరిచిపోవద్దని తలసాని అన్నారు. రైతాంగం నడ్డి విరిచింది బీజేపీ పార్టీ అని అన్నారు. అదానీ లాంటి ఇండస్ట్రియలిస్టులకు ధారాదత్తం చేయాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. సర్జికల్ స్ట్రైక్ లాంటివి బీజేపీ రాజకీయాలు చేస్తుందని ఆయన విమర్శించారు.

నాలుగేళ్లలో 23 వేల కేసులకు పరిష్కారం: తెలంగాణ సమాచార కమిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 14:తెలంగాణ సమాచార కమిషన్ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లోని పెండింగ్ కేసులతో సహా మొత్తం 14,939 అప్పీళ్లు, 8,008 కంప్లైంట్లు పరిష్కరించిందని ఒక ప్రకటనలో తెలిపింది. ఒక్క 2021 సంవత్సరం లోనే 4,646 అప్పీళ్లు, 2,608 కంప్లయింట్లు పరిష్కరించినట్టు తెలిపింది. మొత్తం 104 అప్పీళ్లు లో మొత్తం రూ. 2,92,000 పెనాల్టీ రూపంలో విదించిందని, వాటి రికవరీ బాధ్యత సంబంధిత శాఖా అధికారులకు అప్పజెప్పిందని వెల్లడించింది. కోవిడ్19 సంక్షోభ సమయంలోను టెలిఫోన్ ద్వారా విచారణలు జరిపి కేసుల సత్వర పరిష్కారం కొరకు కృషి చేసిందని తెలిపారు.

అదేవిధంగా కమిషన్ ఏర్పడిన నాటి నుండి 2020 సంవత్సరం వరకు వార్షిక నివేదికలను తయారు చేసి, శాసన సభ ఆమోదం కొరకు ప్రభుత్వానికి సమర్పించిందని, అన్ని ప్రభుత్వ శాఖల నుండి 2021 సంవత్సరం నకు సంబంధించి వార్షిక నివేదికలు అందిన వెంటనే ఆ వార్షిక నివేదిక కూడా పంపేందుకు సన్నద్ధంగా వున్నదని వెల్లడించింది.

పోటెత్తిన ఓటర్లు
సాయంత్రం ఐదు గంటలవరకూ 75.29 శాతం పోలింగ్ నమోదు!

లక్నో,ఫిబ్రవరి 14:: యూపీ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోటెత్తారు. సాయంత్రం ఐదు గంటల వరకూ రికార్డు స్థాయిలో 75.29 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు. ఉదయం నెమ్మదిగా ఆరంభమైన పోలింగ్ ప్రక్రియ ఆపై పోలింగ్ కేంద్రాలకు పెద్దసంఖ్యలో ఓటర్లు చేరుకోవడంతో ఊపందుకుంది. ఇక సంభాల్‌లో బీజేపీ అభ్యర్థి వాహనాన్ని ధ్వంసం చేయడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. అస్మోలి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి హరేంద్ర అలియాస్ రింకూ వాహనంపై కొందరు దాడి చేశారు. అనుచరులతో పాటు అభ్యర్థి పోలీస్ స్టేషన్‌లో తలదాచుకున్నారు. ఘటనా స్థలం నుంచి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రత్యర్థుల దాడిలో రింకూ వాహనం పూర్తిగా ధ్వంసమైంది.

రెండో దశలో భాగంగా యూపీలోని 9 జిల్లాల్లోని 55 అసెంబ్లీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగుతున్నది. ఎన్నికల్లో 586 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. పటిష్ట భద్రత మధ్య ఓటింగ్ కొనసాగుతున్నది. వారసత్వ, కుటుంబ పార్టీలు రాష్ట్రానికి, దేశానికి ఎలాంటి మేలు చేయవని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఝాన్సీలో జరిగిన ర్యాలీలో విమర్శించారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీలు ఆపై ఇప్పుడు రాహుల్ గాంధీ వీరిలో ఎవరైనా రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం పనిచేశారా అని ఆయన ప్రశ్నించారు.

ఇక రాష్ట్రంలో మాఫియాపై ఉక్కుపాదం మోపుతూనే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ మొయిన్‌పురిలో జరిగిన ప్రచార ర్యాలీలో మాట్లాడుతూ పేర్కొన్నారు. ఇక యూపీలో ఫిబ్రవరి 10 నుంచి మార్చి 7 వరకూ ఏడు దశల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా మార్చి 10న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు. ఇక ఈ ఎన్నికల్లో గెలుపొంది మరోసారి పాలనా పగ్గాలు చేపట్టాలని పాలక బీజేపీ పావులు కదుపుతుండగా, యోగి సర్కార్‌పై వ్యతిరేకతను సొమ్ము చేసుకుని అందలం ఎక్కాలని అఖిలేష్ సారధ్యంలోని ఎస్పీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. మరోవైపు ప్రియాంక గాంధీ ఇమేజ్‌తో ఉనికి చాటుకోవాలని కాంగ్రెస్ ఉవ్విళ్లూరుతుండగా..దళితులు, అణగారిన వర్గాల వెన్నుదన్నుతో సత్తా చాటాలని మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ సన్నద్ధమవుతోంది.

శాస్త్రవేత్తల కృషి ఫలించింది.. పీఎస్ఎల్‌వీ-సీ52 ప్రయోగం విజయవంతం

శ్రీహరికోట, ఫిబ్రవరి 14:: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ ఏడాది తొలి విజయాన్ని అందుకున్నది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించిన పీఎస్ఎల్‌వీ-సీ52 రాకెట్ ప్రయోగం విజయవంతమయింది. లక్ష్యం దిశగా దూసుకెళ్లిన సీ52 రాకెట్ మూడు ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.

ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు ఇస్రో చైర్మన్ సోమనాథన్ అభినందనలు తెలిపారు. శాస్త్రవేత్తల కృషి ఫలించిందని, పీఎస్ఎల్‌వీ-సీ52 రాకెట్ ప్రయోగం విజయవంతం అయిందని చెప్పారు. మూడు ఉపగ్రహాలను విజయంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టామని వెల్లడించారు.

పీఎస్ఎల్‌వీ?సీ52 రాకెట్ 1710 కిలోల ఆర్బిట్ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ ఈఓఎస్?04, 17.50 కిలోల ఐఎన్ఎస్-2డీటీ, 8.10 కిలోల బరువున్న ఇన్‌స్పేస్‌శాట్-1 ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఈఓఎస్ అనేది రాడార్ ఇమేజింగ్ శాటిలైట్. దీన్ని వ్యవసాయం, అటవీ సంరక్షణ, నేల తేమ, హైడ్రాలజీ, వరదల మ్యాపింగ్‌కు సంబంధించి అన్ని వాతావరణ పరిస్థితుల్లో హైక్వాలిటీ ఫొటోలను అందించేలా రూపొందించారు. ఐఎన్ఎస్-2డీ ఉపగ్రహాన్ని భవిష్యత్తు సైన్సు, ప్రయోగాత్మక పేలోడ్స్ కోసం భారత్, భూటాన్ సంయుక్తంగా రూపొందించాయి.

తెలంగాణ పోరాటయోధుడు బొమ్మగాని ధర్మభిక్షంకు కేసీఆర్ నివాళి

హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం శత జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఆయనకు నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపిగా ఆయన సమాజానికి చేసిన సేవలను సీఎం స్మరించుకున్నారు. కమ్యూనిస్టు నాయకుడిగా సబ్బండ వర్గాలు, పీడిత ప్రజల హక్కుల కోసం ఆయన ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారని సీఎం అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం నిలిచిన విలువలు కలిగిన నాయకుడిగా ధర్మభిక్షం అందించిన స్ఫూర్తి నేటి తరాలకూ అనుసరణీయమని సీఎం కేసీఆర్ అన్నారు.

ఫెడరలిజాన్ని గౌరవిస్తాం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ఫెడరలిజాన్ని తాము గౌరవిస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సమాఖ్య వ్యవస్థలో భాగంగానే మాజీ సీఎం అమరీందర్ సింగ్ తమ ప్రభుత్వంతో కలిసి పనిచేసినట్లు ప్రధాని తెలిపారు. పంజాబ్‌లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. నవ పంజాబ్ రుణ విముక్తి అవుతుందన్నారు. అయితే ప్రస్తుత పంజాబ్ ప్రభుత్వం తనకు భద్రత కల్పించడంలో విఫలమైనట్లు ఆయన ఆరోపించారు. త్రిపురమాలిని దేవి శక్తిపీఠానికి వెళ్లాలని అనుకున్నానని, కానీ ప్రభుత్వం, పోలీసులు భద్రత కల్పించలేకపోయినట్లు ఆయన తెలిపారు. అయితే త్వరలోనే ఆ శక్తిపీఠం వద్ద పూజలు చేయనున్నట్లు మోదీ తెలిపారు. క్రిమిసంహారకాలు, ఫెర్టిలైజర్స్‌ను గ్లోబల్ మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకే అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. సహజ, ఆర్గానిక్ ఫార్మింగ్ కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. 23 లక్షల మంది పంజాబీ రైతులకు పీఎం కిసాన్ పేమెంట్ అందుతోందన్నారు.

ఆ జీవోతో మహబూబ్‌నగర్ రూపురేఖలు మారబోతున్నవి : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14: మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతమైన ప్రగతి సాధిచబోతుందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు లక్ష్మా రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు.

మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తూ జీవో జారీ అయిందన్నారు. దీంతో మహబూబ్ నగర్, జడ్చర్ల, భూత్ పూర్ కలిసి పెద్ద నగరంగా ఏర్పాటు కాబోతున్నదని మంత్రి పేర్కొన్నారు.

హైదరాబాద్ కు ఊఓఆం వల్లే మంచి రూపం వచ్చింది. అభివృద్ధి సాధ్యమైందన్నారు.

మహబూబ్ నగర్, జడ్చర్ల, భూత్పూరు కలిసి విస్తారంగా అనూహ్యంగా అభివృద్ధి సాధిస్తుందని మంత్రి తెలిపారు. ఉదండాపూర్, కర్వెన రిజర్వాయర్లు మహబూబ్ నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో ఉన్నాయిమన్యం కొండ గుట్టల్లో కూడా ఒక రిజర్వాయర్ వస్తుందన్నారు.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుతో మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించింది. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తుందని మంత్రి తెలిపారు. జాతీయ పార్టీ నాయకులు సభ్యత సంస్కారంతో మాట్లాడాలి.

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్, టీఆర్ఎస్ పోరాటం వల్లే తెలంగాణ వచ్చింది: కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 14: తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి మాణికం ఠాకూర్ కి టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కౌంటర్ ఇచ్చారు. లక్షలాది తెలంగాణ యువత కోరుకున్న, సోనియా అమ్మ కోరుకున్న తెలంగాణ కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తూనే ఉంటుందని మానికం ఠాగూర్ ఈరోజు ట్వీట్ చేశారు. తెలంగాణ ఏర్పడి ఏడేళ్లు కావస్తున్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే ఊసరవెల్లి టీఆర్ఎస్, మతతత్వ బీజేపీలను ఓడించాలని అన్నారు. ఈ రెండు పార్టీలు ఒక నాణేనికి రెండు వైపులు వంటివని చెప్పారు.

మాణికం ఠాగూర్ వ్యాఖ్యలపై కవిత స్పందించారు. కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీ చేసిన పోరాటం వల్లే తెలంగాణ వచ్చిందని, ఇది ఎవరో ఇస్తే వచ్చింది కాదని అన్నారు. ప్రజల పోరాటంలో చివరకు సత్యమే గెలుపొందిందని చెప్పారు. మాజీ ప్రధాని, అతని కుటుంబంపై అసోం సీఎం దారుణ వ్యాఖ్యలు చేస్తే రాజకీయాలకు అతీతంగా రాహుల్ గాంధీకి మద్దతుగా కేసీఆర్ నిలిచారని.. కేసీఆర్ గొప్పదనం, స్థాయి ఇదని అన్నారు.

ప్రతిపక్షాలకు పనిలేక సీఎం కేసీఆర్‌పై ఆరోపణలు.. మంత్రి కేటీఆర్ ధ్వజం

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14:(నేటినిజం ప్రతినిధి): ప్రతిపక్షాలకు పనిలేక సీఎం కేసీఆర్‌పై ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్నాయా? దమ్ముంటే చూపించాలని ప్రతిపక్షాలకు కేటీఆర్ సవాల్ విసిరారు.

ముస్తాబాద్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. కేసీఆర్ అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఈ దేశానికే దిక్సూచిగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రూ.18 వేల కోట్లతో డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించుకుంటున్నాం అని తెలిపారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా.. పేదలు ఉండే ప్రాంతాల్లో ఈ ఇండ్లు నిర్మిస్తున్నాం. ముస్తాబాద్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మాట ఇస్తే నిలబెట్టుకుంటుంది అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల హయాంలో ఒక ఇంటి నిర్మాణం కోసం ముప్పుతిప్పలు పెట్టేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పేదలు ఆత్మగౌరవం బతకాలనే ఉద్దేశంతో డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించి ఇస్తున్నాం. ఈ ఇండ్లు ప్రయివేటు బిల్డర్ కడితే రూ. 20 నుంచి రూ. 25 లక్షల ఖర్చు అయ్యేది. రాజకీయాలకు తావు లేకుండా అర్హులైన వారికి ఇండ్లు కేటాయిస్తున్నాం. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వాన్ని కొందరు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఏ రాష్ట్రంలోనైనా ఇలాంటి డబుల్ బెడ్రూం ఇండ్లు ఉన్నాయా? దమ్ముంటే చూపించాలని సవాల్ విసిరారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ లాంటి పథకాలు అమలవుతున్నాయా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉండే అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. కేసీఆర్ మొండి మనిషి. ఆయన ఏ పని చేపట్టిన పూర్తయ్యేదాకా వదలరు.. కాబట్టి ప్రతీ పేద వ్యక్తికి డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తారని కేటీఆర్ స్పష్టం చేశారు.

లక్ష్యాన్ని మించి లీడ్ బ్యాంక్ రుణాలు:మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, : వరంగల్ జిల్లా మొత్తం ఋణాల పంపిణీ లక్ష్యం 2 వేల 744 కోట్లు కాగా, 4 వేల 36 కోట్ల రుణాలు ఇచ్చి లక్ష్యానికి మించి రెట్టింపు రుణాలు ఇచ్చిన బ్యాంకర్లను జిల్లా అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అభినందించారు. వ్యవసాయ, పరిశ్రమల ఋణాలు అధికంగా ఉండటం అభినందనీయం. వ్యవసాయ రుణాల లక్ష్యం 1 వేయి 233.13 కోట్లు కాగా 1 వేయి 350.40 కోట్ల ఋణాలు, పరిశ్రమలకు 702.88 కోట్ల లక్ష్యం కాగా, 754.81 కోట్ల ఋణాలు మంజూరు చెయ్యడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగానికి రుణాలు రీ షెడ్యూల్ చేయాలని, వెంటనే కొత్త ఋణాలు మంజూరు చేయాలని సూచించారు.ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న దళిత బంధు పథకాల గ్రౌండింగ్ వేగంగా చేయాలని చెప్పారు. వరంగల్ లీడ్ బ్యాంక్ డిసెంబర్ త్రైమాసిక బ్యాంకర్ల సమావేశం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో డిజిటల్ బ్యాంకింగ్ పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ, మొత్తం ప్రాధాన్యత రంగాలకు 2 వేల 482 కోట్ల 60 లక్షల ఋణాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అయితే, వ్యవసాయ టర్మ్ లోన్లు ఇవ్వడం ఇంకా వేగవంతం చెయ్యాలని సూచించారు. మొత్తం 550 కోట్లకు గాను 245 కోట్లు ఇచ్చారు, ఇంకా 205 కోట్లు తొందరగా పూర్తి చేయాలని సూచించారు. 2019-20 ఏడాది లాగానే ఈ ఏడాది కూడా వరంగల్ జిల్లా ప్రధాన మంత్రి అవార్డుకు ఎన్నిక కావాలని ఆకాంక్షించారు. సెంట్రల్ బాంక్ అఫ్ ఇండియా, బాంక్ అఫ్ బరోడా, బాంక్ అఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బాంక్, ఇండియన్ ఓవర్సీస్ బాంక్, ప్రైవేటు బ్యాంకులలో ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకు, కోటక్ మహేంద్ర బ్యాంకు, కర్ణాటక బ్యాంకులు వివిధ ఋణాలలో ఇవ్వడంలో ఆలస్యం అవుతున్నది. అలాంటి బ్యాంకుల పైన తగిన చర్యలు తీసుకొని పై అధికారులకు తెలియ చెయ్యాలని చెప్పారు.

మహిళా స్వయం సహాయక సంఘాల ఋణ మంజూరులో రాష్ట్రంలోనే వరంగల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. 328.13 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 337.34 కోట్ల ఋణాలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ ఘనత సాధించిన బ్యాంకు అధికారులకు, జిల్లా అధికారులకు మరియు జిల్లా కలెక్టర్ ను మంత్రి అభినందించారు. మత్స్య కారులకు, గొల్ల కుర్మలకు, పాల ఉత్పత్తి దారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఎన్నడూ లేని విధంగా వరంగల్ జిల్లా లోనే ఎక్కువగా ఇవ్వడం జరిగింది. కేసీసీ మత్స్యకారులకు 456 లోన్లు, గొల్ల కుర్మలకు, పాలఉత్పత్తి దారులకు 333 లోన్లను మంజూరు చేపించడం జరిగిందని మంత్రి వివరించారు. కరోనా కష్టకాలం కూడా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ బ్యాంకు మేనేజర్ల సహాయం తో కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వడం పట్ల మంత్రి వారిని అభినందించారు.

అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్ అవార్డుల ప్రదానానికి హైదరాబాద్ వేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 14: అంతర్జాతీయ ఫోటోగ్రఫీ అవార్డుల ప్రదాన కార్యక్రమానికి మొదటి సారిగా హైదరాబాద్ నగరం వేదిక కానుంది. ఇంటర్ నేషనల్ ఫోటో?గ్రాఫర్ ఆఫ్ ది ఇయర్ పేరుతో ఈ అవార్డును బహుకరించనున్నారు. ది ఇంటర్నేషనల్ ఫోటోగ్రఫీని ప్రోత్సహించే ఉద్దేశంతో ఇండియన్ ఫోటో ఫెస్టివల్ ను నిర్వహించనున్నారు.

ఈనందర్భంగా 8 కేటగిరీల్లో అవార్డులను ఇవ్వనున్నారు. ఇందులో కరెంట్ అఫెయిర్స్ అండ్ న్యూస్, డాక్యుమెంటరీ, పోర్ట్రెయిట్, ల్యాండ్ స్కేప్, స్ట్రీట్, వైల్డ్ లైఫ్, వెడ్డింగ్, మొబైల్ వంటి కేటగిరీల్లో అవార్డులు ఇస్తారు.

ఫోటోగ్రాఫర్స్ తమ ఎంట్రీలను మార్చి 21వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకూ పంపుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.ఇండియన్ ఫోటో ఫెస్టివల్ కార్యక్రమానికి హెచ్ఎండిఏ, క్రెడాయ్ సహకరిస్తున్నాయి. విజేతకు 25వేల డాలర్ల నగదు, కెమెరాను బహూరించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి 5వేల ఎంట్రీలు వచ్చే అవకాశం వుందని నిర్వాహకులు భావిస్తున్నారు. హైదరాబాద్ కు చెందిన లైట్ క్రాఫ్ట్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ ఫోటో ఫెస్టివల్ నిర్వహించనున్నారు.

విశాలాక్షి సాహిత్య మాస పత్రిక

శ్రీమతి పుష్పాల సూర్యకుమారి గారి సూర్య సాహితీ వేదిక

సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది కథల పోటీ

బహుమతుల వివరాలు

ప్రథమ బహుమతి	రూ. 3000/-
ద్వితీయ బహుమతి	రూ. 2000/-
తృతీయ బహుమతి	రూ. 1500/-
ప్రత్యేక బహుమతులు	రూ. 10,000/-

(10 కథలకు - ఒక్కో కథకు రూ. 1000/-)

- అంశం ఏదైనా పర్వాలేదు
- స్వచ్ఛమైన తెలుగు కథ అయి ఉండాలి
- కొత్త కథలు కావాలి
- వ్రాత ప్రతిలో రెండు పేజీలు
- మెయిల్ / వాట్సప్ లకు అవకాశం లేదు
- పోస్టు ద్వార మాత్రమే అందుకుంటాం
- వీలైతే ప్రత్యేక సంచిక లేదా విశాలాక్షి మాసపత్రికలో ప్రచురిస్తాం.
- మరికొన్ని కథలు సాధారణ ప్రచురణకు ఎంపిక చేస్తాం.
- ఫలితాలు ఏప్రిల్ సంచికలో ప్రచురిస్తాం
- ప్రత్యేక సంచిక అయినా ఏప్రిల్ లోనే ఉంటుంది.
- కథలు చేరవలసిన చివరి తేది ఫిబ్రవరి 28-2022

గడువు : 28-2-2022

Address :
VISALAKSHI MASA PATHRIKA
D.No. 27-5-487, Padmavathi Nagar,
Balaji Nagar Ext,Nellore - 524002.
Cell : 9440529785

చరిత్రలో నేటినిజం

కం॥ ప్రాకృతమని జ్ఞానిచేయు×
సాకారత భాందిన చరితన× నలరారెడి 'రా
ధాకృష్ణ చౌదరి'తా-రా
శి కుడి జ్ఞానమనుచు చేమోడ్పిడుదున్!!

(ఫిబ్రవరి 15 చరిత్ర పరిశోధకులు రాధాకృష్ణచౌదరి జయంతి...) -రాధమ్మ సెల్: 9494481210

చేతక్ స్కూటర్‌ను ప్రవేశపెట్టిన 'హమారా బజాజ్'

(12 ఫిబ్రవరి 2022న తుద శ్వాస విడిచిన ప్రముఖ పారిశ్రామికవేత్త రాహుల్ బజాజ్‌కు అక్షరనివాళి)

10 జూన్ 1938న కలకత్తాలో సావిత్రి-కమల్‌నయన్ బజాజ్ దంపతులకు జన్మించిన రాహుల్ బజాజ్ విద్యాభ్యాసం కేథడ్రల్ జాన్ కానన్ స్కూల్, ఢిల్లీ సెయింట్ స్టీఫెన్స్ కళాశాల, ముంబాయ్ ప్రభుత్వ న్యాయ కళాశాల, అమెరికన్ హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లలో పూర్తి చేశారు. మహాత్మాగాంధీకి అత్యంత సన్నిహితుడైన స్వాతంత్ర్య సమరయోధుడు జమ్నాలాల్ బజాజ్‌కు మనుమడైన రాహుల్ బజాజ్ భారతదేశం గర్వించదగిన బిలియనీర్ పారిశ్రామిక వేత్తగా బజాజ్ కంపెనీకి చైర్మన్‌గా సమర్థవంతమైన ప్రతిభను ప్రదర్శించడంతో భారత ప్రభుత్వం 'పద్మ భూషన్' పురస్కారాన్ని అందించింది. ఉన్నత విద్య అనంతరం 1965లో బజాజ్ గ్రూప్‌కు నాయకత్వం వహించి, బజాజ్ చేతక్ స్కూటర్ ద్వారా ప్రజల వన్నలను చూరగొని అప్రతిహతంగా 5-దశాబ్దాలుగా సేవలందించి కంపెనీ ఆస్తులను 7.5 కోట్ల నుంచి 12,000 కోట్లకు చేర్చడం విశేషం. 2005 వరకు కంపెనీని అగ్రపథంలో నడిపి తన కుమారుడు రాజీవ్ బజాజ్‌కు అప్పగించి ఎమరీటస్ చైర్మన్‌గా కొనసాగారు. 2008లో బజాజ్ ఆటో కంపెనీని విభజించి బజాజ్ ఆటో, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ హోల్డింగ్ కంపెనీలను నెలకొల్పారు.

దేశ పారిశ్రామికాభివృద్ధిలో రాహుల్ బజాజ్ పాత్రను గుర్తించిన కేంద్రప్రభుత్వం రాజ్యసభకు (2006-10) యంపీగా ఎన్నుకున్నారు. 1979-80, 1999-2000ల్లో రెండు పర్యాయాలు సిఐఐ(కాన్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్)కు అధ్యక్షుడిగా సేవలు అందించి రాష్ట్రపతి చేతుల మీదుగా సిఐఐ అధ్యక్షుడిగా సేవలకు 2017లో జీవన సాఫల్య పురస్కారం స్వీకరించారు. ఇండియన్ ఏయిర్‌లైన్స్, ఐఐటి-ముంబాయ్, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లకు చైర్మన్‌గా పని చేస్తూనే హార్వర్డ్ యూనివర్సిటీ, బ్రూకింగ్స్ ఇనిస్టిట్యూట్‌ల కమిటీ సభ్యుడిగా గౌరవ సేవలు విస్తరించారు. 2001లో కేంద్ర ప్రభుత్వ పౌర పురస్కారం 'పద్మ భూషన్'ను పొందారు. 2016లో ఫోర్బ్స్ బిలియనీర్ జాబితాలో 2.4 బిలియన్ డాలర్ల సంపదతో 722 ర్యాంకు పొందారు. ప్రస్తుతం కుమారులు రాజీవ్, సంజీవ్ బజాజ్‌లు కంపెనీల బాధ్యతలు నిర్వహిస్తుండగా కూతురు సునైనా పారిశ్రామికవేత్త మనీష్ కేజ్రీవాల్‌ను వివాహమాడింది. 83-ఏళ్ల రాహుల్ బజాజ్ 12 ఫిబ్రవరి 2022న న్యుమోనియాతో బాధపడుతూ పూనె రూబీ హాల్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. పలు యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లు పొందిన రాహుల్ బజాజ్ జీవితం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు దీపస్తంభం కావాలని కోరుకుందాం. 'హమార బజాజ్' అంటూ మధ్య తరగతి పురుషులకు 'బజాజ్ చేతక్', మధ్య తరగతి మహిళలకు 'బజాజ్ సన్నీ' బైక్‌లను, పేదలకు బజాజ్ ఆటోలను అందించిన రాహుల్ బజాజ్ కృషి అనన్య సామాన్యం, అనుసరణీయం, అభినందనీయం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

2021-22 నుంచి 2025-26 వరకు 26,275 కోట్ల రూపాయల కేంద్ర నిధులతో అమలు కానున్న పథకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాల ఆధునీకరణ (ఎంపిఎఫ్) పథకాన్ని కొనసాగించడానికి ఆమోదం తెలిపింది. 2021-22 నుంచి 2025-26 మధ్య కాలంలో పథకం అమలు జరుగుతుంది, రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు బలగాల ఆధునీకరణ మరియు పనితీరును మెరుగు పరచాలన్న లక్ష్యంతో కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా పథకానికి రూపకల్పన చేశారు. పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన.26,275 కోట్ల రూపాయలను కేంద్ర నిధుల నుంచి సమకూర్చడం జరుగుతుంది. బలాలను ఆధునీకరించి వాటి సామర్థ్యం పెంపొందించేందుకు అవసరమైన అన్ని సంబంధిత ఉప పథకాలను దీనిలో భాగంగా అమలు చేయడం జరుగుతుంది.

పథకం ముఖ్య అంశాలు:

-దేశంలో పటిష్టమైన ఫోరెన్సిక్ వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా నేర న్యాయ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం పథకంలో చర్యలు అమలవుతాయి. అంతర్గత భద్రత, శాంతిభద్రతలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు, మాదకద్రవ్యాల నియంత్రణలో రాష్ట్రాలకు తగిన సహకారం అందించేందుకు పథకంలో భాగంగా చర్యలను అమలు చేయబడతాయి.

-కేంద్ర ప్రభుత్వం అందించే 4,846 కోట్ల రూపాయల నిధులతో రాష్ట్ర పోలీసు బలగాల ఆధునీకరణ పథకం అమలు జరుగుతుంది.

-ఆధునిక పద్ధతుల్లో శాస్త్రీయ మరియు సమయానుకూల పరిశోధనకు దోహదపడే విధంగా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో స్వతంత్ర కార్యాచరణతో ఫోరెన్సిక్ సైన్సెస్ సౌకర్యాలు అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఫోరెన్సిక్ సౌకర్యాల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం 2,080.50 కోట్ల రూపాయలను సమకూరుస్తుంది.

- కేంద్ర పాలిత ప్రాంతాలు అయిన జమ్మూకాశ్మీర్, తిరుగుబాటు ప్రభావిత ఈశాన్య రాష్ట్రాలు మరియు వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో భద్రత సంబంధిత అంశాల కోసం కేంద్ర ప్రభుత్వం 18,839 కోట్ల రూపాయలను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది.

-వామపక్ష తీవ్రవాద సమస్యలను నివారించేందుకు అమలు చేసిన జాతీయ విధానం, కార్యాచరణ కార్యక్రమం తో హింసాత్మక సంఘటనలు గణనీయంగా తగ్గాయి. ఈ కార్యక్రమాన్ని మరికొంత కాలం అమలు చేయాలని నిర్ణయించడం జరిగింది. దీనికోసం 8,689 కోట్ల రూపాయలను సమకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. కేంద్ర నిధులతో వామపక్ష తీవ్రవాద సమస్య పరిష్కారానికి ఆరు సంబంధిత పథకాలు ఆమోదించబడ్డాయి. వామపక్ష తీవ్రవాద ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాలలో కార్యక్రమాలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కేంద్ర సహాయంగా అందించే నిధులతో అమలయ్యే పథకాలు దీనిలో భాగంగా ఉంటాయి.

-ఇండియా రిజర్వ్ బెటాలియన్లు/స్పెషలైజ్డ్ ఇండియా రిజర్వ్ బెటాలియన్లను నెలకొల్పేందుకు 350 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుంది.

-మాదకద్రవ్యాల నియంత్రణ కోసం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 50 కోట్ల రూపాయలతో అమలు జరుగుతున్న కేంద్ర పథకం కొనసాగుతుంది.

కెన్యా పూర్వ ప్రధాని శ్రీ రైలా అమోలో ఒడింగాకు మరియు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మధ్య జరిగిన సమావేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:ప్రస్తుతం భారతదేశానికి ప్రైవేటు సందర్శన కు విచ్చేసినటువంటి కెన్యా పూర్వ ప్రధాని శ్రీ రైలా అమోలో ఒడింగా తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న భేటీ అయ్యారు. ఈ నేత లు ఇద్దరూ దశాబ్దాలు గా స్నేహపూర్వక వ్యక్తిగత సంబంధాల ను నెరపుతున్నారు.

దాదాపు గా మూడున్నర సంవత్సరాల తరువాత శ్రీ ఒడింగా ను కలుసుకోగలిగినందుకు గాను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. 2008వ సంవత్సరం నాటి నుంచి శ్రీ ఒడింగా తో అటు కెన్యా లో మరి ఇటు భారతదేశం లో జరిగిన మాటామంతీ లను, అలాగే 2009వ సంవత్సరం లోను మరియు 2012వ సంవత్సరం లోను వైబ్రెంట్ గుజరాత్ సమిట్ కు శ్రీ ఒడింగా అందించిన సమర్థన ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గుర్తు కు తెచ్చుకొన్నారు.

పరస్పర హితం ముడిపడ్డ ఇతర అంశాల పై ఇద్దరు నేత లు చర్చ లు జరిపారు. భారతదేశం- కెన్యా సంబంధాల ను మరింత గా బలపరచడం కోసం ప్రధాన మంత్రి తన నిబద్ధత ను వెలిబుచ్చారు.

శ్రీ ఒడింగా మంచి ఆరోగ్యం తో ఉండాలని, ఆయన భావి ప్రయాస లు ఫలించాలంటూ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన శుభాకాంక్షల ను వ్యక్తం చేశారు.

రోడ్డు భద్రతపై సీఎం జగన్ సమీక్ష

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:రోడ్డు భద్రతపై సమీక్ష నిర్వహించారు సీఎం జగన్. ఏపీలోని అన్ని జిల్లాల్లో ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ఆయన నిర్ణయం తీసుకున్నారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఆర్టీసీ, ప్రభుత్వం ఉమ్మడి డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుతో పాటు.. కొత్త జిల్లాలకు అనుగుణంగా ప్రతి జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు.కొత్తగా ఏర్పాటు చేస్తున్న 16 మెడికల్ కాలేజీల్లోనూ ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యాధునిక పద్ధతుల్లో ఎమర్జెన్సీ సర్వీసులు ఉండాలని.. ప్రమాదాలకు గురైన వారు కోలుకునేందుకు వీలుగా వైజాగ్ లో రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తిరుపతి బర్డ్ ఆస్పత్రుల్లో ఉన్న సెంటర్‌ను మెరుగుపరచాలని.. రోడ్డుపై లేన్ మార్కింగ్ చాలా స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బైక్‌లు, ఫోర్‌వీల్ వాహనాలకు ప్రత్యేక లేన్స్ ఏర్పాటు పై ఆలోచన చేయాలన్న జగన్.. ఎంత స్పీడులో వెళ్ళాలో సైన్ బోర్డులు పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. చాలా వరకు ప్రమాదాలు తగ్గే ఆస్కారం ఉంటుందని.. ప్రమాదాల నివారణకు రోడ్ల పక్క దాబాల్లో మద్యం అమ్మకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆదిలాబాద్ జిల్లాలో అనాగరిక చర్య - 12కుటుంబాలను వెలివేసిన కుల పెద్దలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 14: ఆదిలాబాద్ జిల్లాలో అనాగరిక చర్య. 12కుటుంబాలను వెలివేశారు కుల పెద్దలు.కులంలోకి రావాలంటే జరిమానా కట్టాలని హుకుం జారీ చేశారు. మూడేళ్లుగా శిక్ష అనుభవిస్తున్నారు బాధిత కుటుంబాలు.శుభకార్యాలకు, చావులకు వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేశారు. చేపల వేట విషయంలో చిన్న వివాదమే దీనికి కారణమని స్థానికులు తెలిపారు. సంఘం భవనం కోసం డబ్బులు ఇవ్వలేదని, 12కుటుంబాలను దూరంగా ఉంచామని పెద్దలు తెలిపారు. ఖోడద్ చేపల చెరువు విషయంలో వివాదం తలెత్తిందని మత్సకారుల సంఘం నేతలు వెల్లడించారు. కాగా తాజాగా మూడేళ్ల నాటి నిర్ణయం వెలుగులోకి వచ్చింది.



రెండు రోజులపాటు 'భారతదేశంలో మ్యూజియంల రీఇమేజింగ్'

గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్న హైదరాబాద్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో 2022 ఫిబ్రవరి 15-16 తేదీలలో హైదరాబాద్ లో 'భారతదేశంలో మ్యూజియంల రీఇమేజింగ్' అనే అంశంపై మొదటిసారిగా రెండు రోజులపాటు గ్లోబల్ సమిట్ ను నిర్వహిస్తోంది. ఈ సమావేశం లో భారతదేశం తో పాటు ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఇటలీ, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ కింగ్ డమ్ వంటి అనేక దేశాల నుంచి మ్యూజియం రంగంలోని నిపుణులు పాల్గొంటున్నారు. ఈ సమావేశ లో పాల్గొనడానికి ప్రజలందరికీ అవకాశం ఉంటుంది. ఇప్పటికి 2300 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశంలోని ప్రజలు, సంస్కృతి మరియు సాధించిన విజయాల యొక్క అద్భుతమైన చరిత్రను స్మరించుకుంటూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకుంటున్న 'ఆజాద్ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించబడుతోంది.

ప్రపంచస్థాయి సమావేశాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి (డిఒఎన్ఇఆర్) శాఖల మంత్రివర్యులు శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ "భారతదేశం మానవ నాగరికత ప్రారంభమైనప్పటి నుండి గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన భూమి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ను జరుపుకుంటున్న ప్రస్తుత తరుణంలో, మన సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడం, శాశ్వతంగా కొనసాగించడం పట్ల కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని, అందుకు అనుగుణంగా అంకితభావంతో కృషి చేస్తున్నదని చెప్పడానికి నేను గర్విస్తున్నాను. భారతదేశంలోని 1000 కి పైగా మ్యూజియంలు ఈ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించడంలో మరియు సంరక్షించడంలో మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి."

"గత 7 సంవత్సరాలుగా డిజిటల్, ఆగ్మెంటెడ్ రియాలిటీ మరియు వర్చువల్ రియాలిటీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం, ఆకర్షణీయమైన ప్రదర్శనలు, సమాచారంతో కొత్త మ్యూజియంలను నిర్మించడంపై నూతనంగా దృష్టి సారించడం జరిగింది. ఇప్పటికే ఉన్న మ్యూజియంలను కొత్త తరానికి అనువుగా ఉండేలా అభివృద్ధి చేయడానికి కూడా కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది" అని మంత్రి తెలిపారు.

ఈ ప్రపంచస్థాయి సమావేశం, మ్యూజియం అభివృద్ధి మరియు నిర్వహణ రంగంలో ఉత్తమ పద్ధతులను మరియు ప్రణాళికలను గురించి చర్చించడానికి వీలుగా భారతదేశం మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ రంగంలోని ప్రముఖులు, నిపుణులు మరియు అభ్యాసకులను ఒకే చోట చేరుస్తుంది. 25 మందికి పైగా మ్యూజియాలజిస్టులు మరియు మ్యూజియం నిపుణులు, మ్యూజియంల పునరుద్ధరణకు సంబంధి ంచిన ప్రాధాన్యతలు మరియు అభ్యాసాలను పరిశీలిస్తారు. ఈ విధంగా పంచుకున్న విజ్ఞానం ద్వారా కొత్త మ్యూజియంల అభివృద్ధికి సంబంధించిన నమూనాను రూపొందించడం, పునరుద్ధరణకు సంబంధించిన విధానాలను అభివృద్ధి చేయడం మరియు భారతదేశంలో ఇప్పటికే ఉన్న మ్యూజియంలను పునరుద్ధరించడం జరుగుతుంది.

ఈ ఆన్ లైన్ సమిట్ నాలుగు విస్తృతమైన అంశాలను కలిగి ఉంటుంది. నమూనా, నిర్మాణం; నిర్వహణ; సేకరణ, (ప్రదర్శన పరిరక్షణ పద్ధతులతో సహా అవగాహన కల్పించటం సహా) విద్య, సందర్శకులు ఈ సమావేశంలో పాల్గొనడం కోసం https://www.reimaginingmuseumsinindia.com/ వెబ్ సైట్ ను సందర్శించగలరు.

కమ్యూనిస్టు ప్రణాళిక నేటికీ సజీవమే

తిరుపతి, ఫిబ్రవరి 14: : 174 సంవత్సరాల కిందట కారల్ మార్క్స్, ఎంగెల్స్ లు సంయుక్తంగా రచించి ప్రపంచ మానవాళికి అందించిన మహత్తర ఆయుధం కమ్యూనిస్టు ప్రణాళిక అని ప్రముఖ సాహితీవేత్త సాకం నాగరాజు వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టు ప్రణాళిక వెలువడి 174 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిపిఎం పార్టీ నాయకత్వంచే ప్రచురించబడిన కమ్యూనిస్టు ప్రణాళిక, కమ్యూనిజం సూత్రాలు, జయించడానికో? ప్రపంచం ఉంది, సోషలిజం.. ఊహాజనితం శాస్త్రీయం వంటి పుస్తకాలను యశోదా నగర్ లోని సిపిఎం కార్యాలయంలో సాహితీవేత్తలు, విద్యావేత్తలు, రచయితలు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాకం నాగరాజు, సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ, రాసాని, గోవిందు, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజులు ఆవిష్కరణ సభలో ప్రసంగించారు.

కమ్యూనిస్టు ప్రణాళిక వెలువడి 174 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ సజీవమైన అంశాలున్నాయన్నారు. నాడు కారల్ మార్క్స్ పేర్కొన్న పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయని దోపిడీ వ్యవస్థ రాజ్యమేలుతోందని చివరకు కార్మికవర్గం దోపిడీ వ్యవస్థపై అంతిమ విజయం సాధించి వర్గాల రద్దుకు కారణమవుతుందన్నారు. ఫిబ్రవరి 21వ తేదీన రెడ్ బుక్ పేరుతో జిల్లావ్యాప్తంగా కమ్యూనిస్టు ప్రణాళిక ప్రాధాన్యతను వివరిస్తూ ప్రదర్శనలు, సభలు నిర్వహిస్తామని ప్రకటించారు. సమాజ మార్పును కాంక్షించే ప్రతి ఒక్కరూ తమతో భాగస్వాములు కావాలని నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, జయచంద్ర, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, వేణు, మల్లికార్జున రావు, జయంతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులే ప్రత్యక్ష దైవాలు : జిల్లా జడ్జి రాధాకృష్ణ కృపాసాగర్

కర్నూలు, ఫిబ్రవరి 14:ప్రజలకు నిరంతరం సేవలు చేస్తున్న వైద్యులే ప్రత్యక్ష దైవాలని జిల్లా జడ్జి రాధాకృష్ణ కృపాసాగర్ అన్నారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ కర్నూలు ప్రభుత్వాసుపత్రి కార్డియాలజి విభాగంలో విశేష సేవలందించిన కార్డియాలజి ప్రొఫెసర్ డా. చంద్రశేఖర్ కు "సర్టిఫికెట్ ఆఫ్ కమిట్మెంట్" అవార్డు అందించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని కార్డియాలజి విభాగాన్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దితే, వేలాది రోగులను సంపూర్ణ ఆరోగ్యవ ంతులుగా పునర్జన్మనిచ్చిన డా. చంద్రశేఖర్ ఈ అవార్డుకు అన్ని విధాలా అర్హుడన్నారు. ఆయనకు తన స్వహస్తాలతో అవార్డునం దించడం తనకు గర్వకారణంగా ఉందన్నారు. ఒక వైద్యునిగానే కాకుండా ఒక సమాజ సేవకుడిగా డా.చంద్రశేఖర్ అంది స్తున్న సేవలు ఇతర వైద్యులకు ఆదర్శనీయమని జిల్లా జడ్జి అన్నారు.

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ? సేవాకార్యక్రమాలకు అత్యున్నత అవార్డు పొందిన డా. చంద్రశేఖర్ తనకు సహ విద్యార్థి కావడం తనకు ఎంతో స్ఫూర్తినిస్తోందన్నారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటె ండెంట్ హోదాలో డా.చంద్ర శేఖర్ హయాంలో ఆసుపత్రి రూపురేఖలే మారిపోయా యన్నారు. పరిపాలనలో ఆయ న పాటించిన సంప్రదాయాలను కొనసాగి ంచడానికి తాము కృషి చేస్తున్నామని చెప్పారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ సౌత్ ఇండియా ఇన్ఛార్జి డా.ఎలియాజర్ మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో రెండు దశాబ్దాలుగా డా. చంద్రశేఖర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, కొవిడ్ ఫస్ట్ వేవ్ లో కర్నూలు కొవిడ్ నుంచి గట్టెక్కడానికి ఆయన ముందుచూపుతో తీసుకున్న చర్యలను పరిగణనలోకి తీసుకుని ఆయనకు ఈ అవార్డు ప్రకటించామని చెప్పారు. యావత్ దక్షిణ భారతదేశంలోనే ఈ అవార్డు పొందిన మొట్టమొదటి వైద్యుడు డా. చంద్రశేఖర్ కావడం కర్నూలు ప్రజలకు గర్వకారణమని అన్నారు.అవార్డు గ్రహీత డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 20 ఏళ్ల కిందట తాను కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో అడుగిడినప్పటి నుంచీ పెద్దాసుపత్రిని ఒక దేవాలయంలా భావించి చిత్తశుద్ధితో విధులు నిర్వహించానన్నారు. తాను, తన సహచరులు చేసిన నిర్విరామ కృషి వల్ల 2003 సం.లో ఐ.సి.సి.యు ఏర్పాటైందన్నారు. అదేవిధంగా 2008 సంవత్సరంలో ఏర్పాటు చేసిన క్యాత్ ల్యాబ్ ద్వారా ఆరు జిల్లాలలోని వేలాది రోగులకు సేవలందించామని చెప్పారు. 2016 నుంచీ గుండె ఆపరేషన్లు కూడా మొదలయ్యాయన్నారు. కార్డియాలజీలో పి.జి సీట్లు సాధించడంలో తాను సఫలీకృతమయ్యానని ఆయన చెప్పారు.

కొవిడ్ ఫస్ట్ వేవ్ సమయంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో వి.డి.ఆర్.యల్ ల్యాబ్ ఏర్పాటు చేయించి కరోనా మహమ్మారిని దీటుగా ఎదుర్కొన్నామని చెప్పారు. తదనంతరం డా.చంద్రశేఖర్ కు "సర్టిఫికెట్ ఆఫ్ కమి ట్మెంట్" అవార్డును జిల్లా జడ్జి, డా.ఎలి యాజర్ అందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డా. భవాని ప్రసాద్, డా.సీతాంజనేయ, డా. శ్రీనివాసులు, డా.వెంకటరమణ, ఇతర వైద్యులు, కార్డియాలజీ విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

చింతకుంటలో కుక్కల దాడిలో 14 గొర్రెలు మృతి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14:: మహబూబ్ నగర్ జిల్లాలో గొర్రెల మందపై కుక్కల దాడి చేయడంతో 14 గొర్రెలు మృతిచెందాయి. కోసిగి మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన నరసప్ప గారి హనుమంతు అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందడంతో గ్రామంలోని గొర్రెల కాపరులు ఆందోళన చెందుతున్నారు. పొలంలో గొర్రెలు నిలుపుటకు ఏర్పాటు చేసిన స్థలంలో గొర్రెలు ఉండగా ఆ మందలోకి ఆరు కుక్కలు ప్రవేశించి దాడి చేయడంతో 14 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధిత కాపరికి సుమారు రూ 1 లక్ష 50 వేలు ఆస్తి నష్టం జరిగింది. మృతిచెందిన గొర్రెలు ఒక్కొక్కటి తొమ్మిది వేల నుండి 11 వేల వరకు ఖరీదు ఉంటుందని బాధితులు తెలిపారు.

రేడియో శ్రోతలకు మరియు ఈముఖ్యమైన మాధ్యమాన్ని సంపన్నం చేస్తున్న వారికి అభినందనలు- ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:రేడియో ప్రసారాల ను వింటూ ఉండే వారు అందరి కి మరియు ముఖ్యమైనటువంటి ఈ మాధ్యమాన్ని తమ ప్రతిభ తో సంపన్నం చేస్తున్న వారికి ప్రపంచ రేడియో దినం సందర్భం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందనల ను వ్యక్తం చేశారు.

"రేడియో ప్రసారాల ను వింటూ ఉండే వారు అందరి కి మరియు ముఖ్యమైనటువంటి ఈ మాధ్యమాన్ని తమ ప్రతిభ తో, రచనాత్మకత తో సంపన్నం చేస్తున్న వారి కి ప్రపంచ రేడియో దినం సందర్భం లో ఇవే అభినందన లు. ఇంట్లో కావచ్చు, ప్రయాణాల లో కావచ్చు, ఇంకా ఇతరేతర స్థలాల లో కావచ్చు.. ప్రజల జీవితాల లో రేడియో మమేకం అయిపోయింది. ప్రజల తో ముడిపడటానికి అది ఒక అద్భుతమైనటువంటి మాధ్యమం గా ఉంది."

సకారాత్మకత ను ప్రసరింపచేయటానికి అలాగే ఇతరుల జీవితాల లో ఒక గుణాత్మకమైనటువంటి మార్పు ను తీసుకు రావడం లో ముందు భాగాన నిలబడుతున్న వారి ని గుర్తించటానికి రేడియో ఏ విధం గా ఒక గొప్ప మాధ్యమం కాగలుగుతుందో అనే విషయాన్ని చమన్ కీ బాత్ (మనసు లో మాట) కార్యక్రమం కారణం గా నేను పదే పదే గమనిస్తూ వస్తున్నాను. ఈ కార్యక్రమాని కి తోడ్పాటు ను అందిస్తున్న వారందరి కి కూడా నేను ధన్యవాదాల ను వ్యక్తం చేయదలచుకొన్నాను." అని పేర్కొన్నారు.

మా ఊరు-మా బడి కార్యక్రమం చేపట్టబోతున్నాం: జవహర్

విజయవాడ, ఫిబ్రవరి 14: జగన్‌రెడ్డి నిర్వాకంతో ఏపీ విద్యారంగం భ్రష్టుపట్టిందని మాజీ మంత్రి జవహర్ మండిపడ్డారు. విద్యార్థులను విద్యకు, స్కూళ్లను గ్రామాలకు దూరం చేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రాథమిక విద్యాభ్యాసానికి చంద్రబాబు అధిక ప్రాధాన్యతిచ్చారని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో కిలోమీటర్‌కి ఒక స్కూల్ ఏర్పాటు చేశారని అన్నారు. జగన్‌రెడ్డి మాత్రం 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో పెట్టాలనడం, ముమ్మాటికీ విద్యారంగాన్ని నాశనం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. భావితరాల భవిష్యత్ కోసం టీడీపీ ఆధ్వర్యంలో మా ఊరు-మా బడి కార్యక్రమం చేపట్టబోతున్నామని ఆయన వెల్లడించారు

దూరదర్శన్ కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

హైదరాబాద్, ఫిబ్రవరి 14: కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ సోమవారం హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రాన్ని సందర్శించారు. దూరదర్శన్ కేంద్రంలోని ప్రతి విభాగాన్నిఆయన పరిశీలించారు. అధికారులను సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. దూరదర్శన్ లో ప్రసారమవుతున్న వివిధ కార్యక్రమాల వివరాలను కూడా మంత్రి తెలుసుకున్నారు.అనంతరం దూరదర్శన్, ఆకాశవాణి కార్యక్రమాలపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

అమెరికన్ పౌరులు వెంటనే స్వదేశానికి వచ్చేయాలి :బైడెన్ సూచన

వాషింగ్టన్, ఫిబ్రవరి 14:: ఉక్రెయిన్‌పై యుద్ధ వాతావరణం నెలకొన్నది. ఆ దేశంపై ఏ క్షణమైనా దాడికి చేయడానికి రష్యా సర్వం సన్నద్ధం చేసుకుంటున్నది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌లో ఉన్న తమ పౌరులు వెంటనే స్వదేశానికి వచ్చేయాలని అమెరికా అధ్యక్షుడు బోబైడెన్ కోరారు. అమెరికన్ పౌరులు వెంటనే ఉక్రెయిన్‌ను విడిచిపెట్టాలని సూచించారు. రష్యాతో ముప్పు పొం

బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి గంగుల

కరీంనగర్ ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం ఆర్థిక ఇబ్బందులతో ఒకే కుటుంబ లోని ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. కాగా వారి కుటుంబ సభ్యులను మంత్రి గంగులకమలాకర్ పరామర్శించారు.

ఎవరు కూడా అధైర్యపడొద్దని అండగా ఉంటామన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ కృష్ణారావు, గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

జవాన్ల త్యాగాలను కించపరిచేలా మాట్లాడటం దేశద్రోహమే: కేసీఆర్‌కు బండి కౌంటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 14: జవాన్ల త్యాగాలను కించపరిచేలా మాట్లాడటం దేశద్రోహమేనని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ చెప్పారు. సర్జికల్ స్ట్రైక్స్ జరగలేదని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడటం సరికాదన్నారు. సర్జికల్ స్ట్రైక్స్‌పై సైన్యాన్ని, ప్రధాని మాటలను కేసీఆర్ నమ్మడం లేదని, మరి మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజహర్ చెబితే నమ్ముతారా అని బండి ప్రశ్నించారు. సైన్యాన్ని అనుమానిస్తోన్న కేసీఆర్ ఏ దేశానికి మద్దతు పలుకుతున్నారో చెప్పాలని బండి డిమాండ్ చేశారు. సైనికుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా మాట్లాడిన కేసీఆర్ వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కేసీఆర్ ఈ మధ్య టెన్ జన్‌పథ్ స్ట్రీట్ ఫాలో అవుతున్నారని రాబోయే రోజుల్లో ప్రగతి భవన్ నుంచి గాంధీభవన్‌కు మారబోతున్నారని బండి ఎద్దేవా చేశారు. మోదీ వచ్చాకే రాష్ట్రాలకు ఇచ్చే నిధుల్ని 32 నుంచి 42 శాతం పెంచిన విషయాన్ని బండి గుర్తు చేశారు. కేంద్రం పేరు చెప్పి మీటర్లు పెట్టేందుకు కేసీఆర్ యత్నిస్తున్నారని బండి ఆరోపించారు. విద్యుత్ మీటర్ల సమస్య దేశవ్యాప్తంగా ఎందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ రైతులను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.

సరికొత్త హంగులతో పురావస్తుశాలలు.. హైదరాబాద్‌లో రెండ్రోజులపాటు ప్రపంచస్థాయి సమావేశాలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: పురావస్తుశాలలను సరికొత్త హంగులతో.. మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తమైంది. ఈ క్రమంలో 'రీఇమాజినింగ్ మ్యూజియమ్స్ ఇన్ ఇండియా' పేరుతో కేంద్ర సాంస్కృతిక శాఖ హైదరాబాద్‌లో రెండ్రోజుల పాటు ప్రపంచస్థాయి సమావేశాన్ని నిర్వహించనుంది. ఫిబ్రవరి 15-16 తేదీల్లో జరగనున్న ఈ సమావేశాన్ని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు. వర్చువల్ విధానంలో సాగే ఈ సమావేశంలో భారత్, అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, ఇటలీ, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా వంటి అనేక దేశాలకు చెందిన పురావస్తు రంగ నిపుణులు పాల్గొననున్నారు. ఆసక్తిగల ప్రజలు కూడా ఇందులో పాల్గొనవచ్చు.

ఇప్పటికే 2300 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అద్భుతమైన చరిత్రను స్మరించుకుంటూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకుంటున్న 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు కేంద్ర సాంస్కృతిక శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. పురావస్తుశాల (మ్యూజియం) అభివృద్ధి, నిర్వహణ రంగంలో ఉత్తమ పద్ధతులు, ప్రణాళికల గురించి చర్చించడానికి వీలుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ రంగంలోని ప్రముఖులు, నిపుణులు, అభ్యాసకులను ఈ సమావేశం ఒకే వేదిక మీదకు తీసుకొస్తోంది. 25 మందికి పైగా మ్యూజియాలజిస్టులు, మ్యూజియం నిపుణులు, మ్యూజియాల పునరుద్ధరణకు సంబంధించిన ప్రాధాన్యతలను, అభ్యాసాలను పరిశీలిస్తారు. ఈవిధంగా పంచుకున్న విజ్ఞానం ద్వారా కొత్త మ్యూజియంల అభివృద్ధికి సంబంధించిన నమూనాను రూపొందించడం, పునరుద్ధరణకు సంబంధించిన విధానాలను అభివృద్ధి చేయడం, అలాగే దేశంలో ఇప్పటికే ఉన్న మ్యూజియంలను పునరుద్ధరించడం చేయనున్నారు.

ఈ సమావేశం గురించి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశం మానవ నాగరికత ప్రారంభమైనప్పటి నుండి గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన భూమి అని, 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'ను జరుపుకుంటున్న ప్రస్తుత తరుణంలో, మన సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడం, శాశ్వతంగా కొనసాగించడం పట్ల కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. భారతదేశంలోని 1000 కి పైగా పురావస్తుశాలలు ఈ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించడంలో, సంరక్షించడంలో మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించడంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గత 7 సంవత్సరాలుగా డిజిటల్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం, ఆకర్షణీయమైన ప్రదర్శనలు, సమాచారంతో కొత్త మ్యూజియంలను నిర్మించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. ఇప్పటికే ఉన్న మ్యూజియంలను కొత్త తరానికి అనువుగా అభివృద్ధి చేయడానికి కూడా కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోందని అన్నారు.

యాదాద్రి పాతగుట్టలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

యాదాద్రి, ఫిబ్రవరి 14: యాదాద్రి దేవస్థాన అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనృసింహుడి సన్నిధిలో హనుమంత వాహన సేవోత్సవం సోమవారం నేత్రపర్వంగా సాగింది. వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనృసింహుడిని శ్రీరామావతారంలో అలంకరించి హనుమంత వాహనంపై తీర్చిదిద్దిన ఆచార్యులు తిరువీధి సేవోత్సవం నిర్వహించారు. ప్రధానాలయంలో కొలువుదీరిన స్వయంభువులను ఆరాదించిన అర్చకబృందం ఉత్సవమూర్తులకు నవకలశ స్నపనం నిర్వహించారు. అనంతరం లక్ష్మీనృసింహుడిని శ్రీరాముడిగా దివ్యమనోహరంగా అలంకరించి హనుమంత వాహనంపై అధిష్టింపజేసి తిరువీధుల్లో ఊరేగించారు. యాగశాలలో పంచసూక్తాలు, మూల మంత్ర పఠనాలతో హోమపూజలు కొనసాగాయి.

దివ్యాంగులు మరియు వయోవృద్ధుల కోసం 'సామాజిక అధికారిత శివర్' & 'ఇంటిగ్రేటెడ్ మొబైల్ సేవల వ్యాన్'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:భారత ప్రభుత్వ సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఏఐడీపీ పథకం కింద 'దివ్యాంగజన్'కి తగిన సాయం, సహాయ పరికరాలను అందించేందుకు గాను 'సామాజిక అధికారిత శివర్' కార్యక్రమాన్ని చేపట్టింది. 'రాష్ట్రీయ వయోశ్రీ యోజనన (ఆర్‌వీవై పథకం) కింద వయోవృద్ధులకు సహాయాలు మరియు సహాయక పరికరాల పంపిణీ కోసం 'సామాజిక అధికార శివిర్'ను డిపార్ట్‌మెంట్

నిర్వహిస్తుంది. ఏఎల్ఐఎంసీఓ, ఛతంపూర్ జిల్లా పాలనా వ్యవస్థతో కలిసి వీటిని ప్రారంభించనుంది. రేపు (13.02.2022) మధ్యాహ్నం 12 గంటలకు మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్, నెం.1లోని ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో వికలాంగుల సాధికారత (డీఈపీడబ్ల్యూడీ) డిపార్ట్‌మెంట్ వారి సౌజన్యతో దీనిని ఏర్పాటు చేయనున్నారు. మొత్తం రూ.2.33 కోట్ల విలువైన 5286 సహాయాలు మరియు సహాయక పరికరాలఉచితంగా పంపిణీ చేయబడతాయి. కోవిడ్-19 మహమ్మారి దృష్ట్యా డిపార్ట్‌మెంట్ రూపొందించిన ఎస్ఓపీని అనుసరిస్తూ బ్లాక్/పంచాయతీ స్థాయిలలో 1391 మంది దివ్యాంగులకు, 553 మంది సీనియర్ సిటిజన్‌లకు ఉచితంగా ఇవి పంపిణీ చేయబడతాయి. గౌరవనీయులైన కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు, ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి "ఆఫ్టర్-సేల్ సర్వీస్" అందించడానికి అలిమ్‌కో అభివృద్ధి చేసిన 'ఇంటిగ్రేటెడ్ మొబైల్ సర్వీస్ డెలివరీ వ్యాన్'ని కూడా ప్రారంభిస్తారు. ప్రభుత్వ ఏడీఐపీ/ఆర్‌వీవై పథకం కింద పంపిణీ చేయబడుతున్న ఎయిడ్స్ మరియు సహాయక పరికరాల కోసం గమ్యస్థానంలో ఉన్న ప్రదేశంలో మరమ్మత్తులు/దిద్దుబాటు/సర్దుబాటు మరియు ప్రాస్తెటిక్స్ మరియు ఆర్థోటిక్స్ పరికరాలను అమర్చడం మరియు ఎయిడ్స్ మరియు సహాయక పరికరాల వినియోగంపై అవగాహన ప్రచారాన్ని చేపట్టడం. భారతదేశంలో, దివ్యాంగులు మరియు సీనియర్ సిటిజన్‌లకు ఇటీవలి కాలంలో సహాయాలు మరియు సహాయక పరికరాలను వివిధ జిల్లాల్లో పంపిణీ చేస్తున్నారు. మధ్యప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ శ్రీ ప్రదుమ్న్ సింగ్ లోధి మరియు ఎమ్మెల్యే, బదమల్హేరా, మధ్యప్రదేశ్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. అలిమ్‌కో సంస్థ సీఎండీ శ్రీ రాజన్ సెహగల్ మరియు ఆ సంస్థ సీనియర్ అధికారులు, జిల్లా పరిపాలన అధికారులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

నాన్-పవర్ సెక్టార్ కోసం కోల్ ఇండియా లిమిటెడ్ వద్ద తగినంత స్టాక్ ఉంది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) ప్రస్తుతం విద్యుత్ యేతర రంగానికి (ఎన్‌పిఎస్) రోజుకు దాదాపు 3.4 లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేస్తోంది. ఇది ఈ విభాగానికి కంపెనీ సగటు సరఫరా. 37 మిలియన్ టన్నుల (ఎంటీలు) కంటే ఎక్కువ బొగ్గు దాని పిట్‌హెడ్‌ల వద్ద సిఐఎల్ ఈ రంగానికి సరఫరాలను మరింత పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్థిక సంవత్సరం-2022లోని ఏప్రిల్-జనవరి సమయంలో 101.7 మిలియన్ టన్నుల (ఎంటీలు) వద్ద ఎన్‌పీఎస్‌కి సిఐఎల్ పంపడం ప్రామాణిక మహమ్మారి రహిత ఎఫ్‌వై'20 సంబంధిత కాలంలో 94 ఎంటీలతో పోలిస్తే ఇది 8.2 శాతం పెరిగింది. ఎఫ్‌వై'19కు సంబంధించి పోల్చదగిన కాలానికి సిఐఎల్ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు అత్యధిక మొత్తం బొగ్గు పంపిణీని నమోదు చేసినప్పుడు ఎన్‌పీఎస్ రంగానికి సరఫరా 91.5 ఎంటీల కంటే 11 శాతం పెరిగింది.

ఈ కాలంలో విద్యుత్ రంగానికి సరఫరా చేసిన వాటి కంటే ఎన్‌పిఎస్ వినియోగదారులకు సరఫరాలలో పెరుగుదల అధిక స్థాయిలో ఉంది. ఏప్రిల్'20-జనవరి 21లో ఎన్‌పిఎస్ విభాగానికి 105 ఎంటీలు పంపడం ఎఫ్‌వై'22 ఇదే కాలంతో పోలిస్తే 3 ఎంటీల కంటే కొంచెం ఎక్కువగా ఉంది. కోవిడ్ సంక్షోభ సంవత్సరంలో డెస్పాచ్ పెరగడానికి కారణాలు చాలా ఉన్నాయి.

ఎఫ్‌వై'21లో ఎక్కువ భాగం బొగ్గు తీసుకోవడం వల్ల కోవిడ్ కారణంగా డిమాండ్ అంతరాయం ఏర్పడింది. దీంతో సిఐఎల్ ఎన్‌పిఎస్ విభాగానికి సరఫరాలను పెంచింది. అంతేకాకుండా 2021 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో సిఐఎల్ ఈ-వేలం అమ్మకాలు నోటిఫైడ్ ధరకు పరిమితం చేయబడినందున ఎన్‌పిఎస్ కస్టమర్లు కూడా అధిక మొత్తంలో బొగ్గును తీసుకునేందుకు మొగ్గు చూపారు. దేశీయ బొగ్గుతో కలపడం కోసం ఏదైనా ఆర్థిక సంవత్సరంలో ఎన్‌పిఎస్ దాదాపు 170 ఎంటీల బొగ్గును దిగుమతి చేసుకుంటుంది. కానీ ఎఫ్‌వై'22లో అసాధారణంగా పెరిగిన అంతర్జాతీయ బొగ్గు ధరలు అవసరమైన పరిమాణాన్ని దిగుమతి చేసుకోవడానికి అవరోధంగా మారాయి. తద్వారా వాటి చివరిలో బొగ్గు కొరత ఏర్పడింది. విద్యుత్ యేతర రంగానికి సరఫరాను మరింత పెంచడానికి సిఐఎల్ తగినంత బఫర్ స్టాక్‌ను కలిగి ఉంది.

ఎఫ్‌వై'22 విద్యుత్ ఉత్పత్తిలో అపూర్వమైన పెరుగుదల కనిపించింది. వృద్ధి రేటు దశాబ్దంలో అత్యధికంగా ఉంది. జాతీయ ప్రాధాన్యతపై విద్యుత్ రంగం యొక్క బొగ్గు డిమాండ్‌ను తీర్చాల్సిన అవసరం ఉంది. పటిష్టమైన ఆర్థిక పునరుద్ధరణపై ఆర్థిక సంవత్సరం జనవరి'22 వరకు మొత్తం బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి పురోగతిలో ఉంది, ఇది సంవత్సరానికి పోల్చితే 11.2% పెరిగింది. ఈ కాలంలో దేశీయ బొగ్గు ఆధారిత ఉత్పత్తి 17% పెరిగింది. విద్యుత్ రంగానికి బొగ్గు సరఫరాలో ఎక్కువ భాగాన్ని సిఐఎల్ ప్రాధాన్యతపై సమకూర్చింది.

2021-22 ఏప్రిల్-జనవరి మధ్య కాలంలో 14 దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి 48 శాతం తగ్గింది. ఫలితంగా ఉత్పాదక అంతరాన్ని అధిగమించడం దేశీయ బొగ్గు ఆధారిత జనరేటర్లపై పడిపోయింది, దీనికి స్వదేశీ బొగ్గు సరఫరా అవసరం. ఈ అదనపు డిమాండ్‌లో దాదాపు 20 ఎంటీల మేరకు సిఐఎల్ సరఫరా చేసింది. అంటే ఆ మేరకు దిగుమతులను తగ్గించగలిగారు.

విద్యుత్ రంగానికి బొగ్గు ప్రాధాన్యత మరియు ఇతర సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ఎఫ్‌వై'22 జనవరి వరకూ 101.7 ఎంటీలు సిఐఎల్ సరఫరా చేసింది. గత సంవత్సరం ఇదే కాలంలో ఎన్‌పీఎస్ వినియోగదారులకు 97% సరఫరా చేసింది.

జనసంద్రమైన వేములవాడ రాజన్న ఆలయం

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ: దక్షిణ కాశి వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. మేడారం జాతరకు ముందు రాజన్నను దర్శించుకునే ఆనవాయితీలో భాగంగా వేములవాడకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో రాజరాజేశ్వరుని ఆలయం జనసంద్రమైంది.

స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే భారీ సంఖ్యలో క్యూలైన్లలో వేచిఉన్నారు. దీంతో రెండు గంటల సమయం పడుతున్నది. కోడె మొక్కుకోసం మరో 3 గంటలు పడున్నది.

కాగా, స్వామివారిని ఉదయం 11 గంటల వరకు 20 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

తెలుగు భాష, సంస్కృతులను కాపాడుకునేందుకు కూడా ప్రత్యేక చొరవ తీసుకోవాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 14:వివక్షలకు తావులేని సమ సమాజ నిర్మాణంలో రామానుజుని ఆదర్శాలు సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. వారి ఆదర్శాలను యువత అర్థం చేసుకుని, నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాద్ ముచ్చింతల్ లో ఏర్పాటు చేసిన 216 అడుగుల రామానుజాచార్యుల వారి విగ్రహాన్ని ఉపరాష్ట్రపతి సందర్శించారు. 1000 సంవత్సరాల క్రితమే అంటరానితనం, వివక్షలకు తావులేని సమాజాన్ని ఆకాంక్షించి సమానత్వ సాధన కోసం కృషి చేసిన భగవద్రామానుజుల వారు ఆధ్యాత్మికవేత్తగానే గాక, సామాజిక సంస్కరణాభిలాషిగా సమాజంపై చెరగని ముద్ర వేశారన్నారు.

భగవంతుడు అందరివాడు అంటూ శ్రీ రామానుజుల వారు ప్రవచించిన విశిష్టాద్వైతం ప్రపంచానికి నూతన మార్గంలో దిశానిర్దేశం చేసిందన్న ఉపరాష్ట్రపతి, అలాంటి మహనీయుని అతిపెద్ద విగ్రహాన్ని ముచ్చింతల్ లో నెలకొల్పడం వారి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటడమే గాక, వారి స్ఫూర్తిని ముందుతరాలకు అందజేయగలదన్నారు. సమతా ప్రతిమ ఏర్పాటులో విశేష కృషి చేసిన శ్రీ చిన్నజీయర్ స్వామి వారికి, భూమిని విరాళంగా ఇచ్చిన మై హోమ్ అధినేత శ్రీ జూపల్లి రామేశ్వరరావు గారికి, రామానుజ సహస్రాబ్ది కమిటీ సహా ఈ కార్యక్రమంలో భాగస్వాములైన వారందరికీ ఉపరాష్ట్రపతి అభినందనలు తెలిపారు.

రామానుజుల వారు గురువు కోసం సాగించిన అన్వేషణ ఈతరం యువతకు స్ఫూర్తిదాయకమన్న ఉపరాష్ట్రపతి, ప్రస్తుత వేగవంతమైన జీవన శైలిలో గురువు ప్రాధాన్యతను గుర్తించే దిశగా వారి జీవితం నుంచి నేర్చుకోవలసిన అంశాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. 18 పర్యాయాలు నడిచి వెళ్ళి, ఎన్నో శ్రమలకోర్చి సంపాదించుకున్న అష్టాక్షరి మంత్రాన్ని సమాజం కోసం, సామాన్య జనావళి కోసం బహిర్గతం చేసి, విద్య అందరికీ.. విజ్ఞానం అందరిదీ అని చాటిన వారి స్ఫూర్తి ఆదర్శనీయమైనదని తెలిపారు. రామానుజుని బాటలో గురువులు, ఆచార్యులు, ఆధ్యాత్మికవేత్తలు సామాన్యులకు మరింత చేరువ కావాలని, వారి సమస్యలకు పరిష్కారం చూపాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతమైన సమాజాన్ని ఆకాంక్షించిన రామానుజుల వారు గురువు విషయంలోనే గాక, శిష్యుల విషయంలోనూ అదే ఆదర్శాలను కొనసాగించారని తెలిపారు. అంటరానితనం అమానుషమని శాసనం చేసిన రామానుజుల వారు, వారిని తిరుక్కులత్తార్ అని సంబోధించారన్న ఉపరాష్ట్రపతి, మహాత్ముడు సూచించిన హరిజన పదంలోనూ ఇదే స్ఫూర్తి దాగి ఉందన్నారు. అంతేకాకుండా మహాత్ముడు ఎంతో ఇష్టపడే వైష్ణవ జనతో గీతం కూడా రామానుజుల స్ఫూర్తితో రచించినదేనని పేర్కొన్నారు.

స్త్రీ విద్య విషయంలో వెయ్యేళ్ళ క్రితమే రామానుజుల వారు ఆచరణాత్మక ఆలోచన విధానాన్ని తెలియజేశారన్న ఉపరాష్ట్రపతి, బేటీ బచావ్ బేటీ పఢావ్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం దీన్ని ఆచరణలో చూపించడం అభినందనీయమన్నారు. గడచిన ఏడేళ్ళలో బాలికల జననాల నిష్పత్తి 19 పాయింట్లు పెరగడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఆయన, స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్ళ తర్వాత కూడా స్త్రీ విద్య గురించి, మహిళా సాధికారత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పరిస్థితులు ఏర్పడడం విచారకరమన్నారు. ఇలాంటి వివక్షలకు అతీతమైన సమాజాన్ని నిర్మించేందుకు యువత ముందుకు రావాలని సూచించారు. స్వచ్ఛభారత్ అభియాన్, జల్ జీవన్ మిషన్, సౌభాగ్య, ఉజ్వల, ఆయుష్మాన్ భారత్ వంటి అనేక కేంద్ర ప్రభుత్వ పథకాల్లోని సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ నినాదం వెనుక రామానుజుల వారి ఆలోచనలతో పాటు, అంత్యోదయ స్ఫూర్తి కనపడుతుందని తెలిపారు.

సమతా విగ్రహాన్ని సందర్శన స్థలంగానే గాకుండా, రామానుజాచార్యుల వారి చరిత్రను, సందేశాలను తెలియజేసే విధంగా గ్యాలరీను ఏర్పాటు చేయడం, వేదిక్ డిజిటల్ లైబ్రరీలకు రూపకల్పన చేయడం మంచి ఆలోచన అన్న ఉపరాష్ట్రపతి, వీటి ద్వారా ఆధ్యాత్మిక స్ఫూర్తి పరిఢవిల్లడమే గాక, మన సంస్కృతి ? సంప్రదాయాల పరిరక్షణ సాధ్యమౌతుందని ఆకాంక్షించారు. ఇదే కేంద్రంలో ఆధ్యాత్మికతతో పాటు తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే విధంగా, భాషాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే బావుంటుందని శ్రీ జీయర్ స్వామివారికి ఉపరాష్ట్రపతి సూచించారు. విగ్రహ నిర్మాణంలో శ్రీ రామేశ్వరరావు గారి కృషిని అభినందించారు.

హర్యానా గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి, కేంద్ర వినియోగదారులు వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ అశ్విని చౌబే, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామి, ప్రధాన ట్రస్టీ శ్రీ జె.రామేశ్వరరావు, సినీ నటులు శ్రీ చిరంజీవి, శ్రీ రామానుజ సహస్రాబ్ది కమిటీ అధ్యక్షులు శ్రీ జి.వి. భాస్కర్ రావు, జియ్యర్ ఇంటిగ్రేటెడ్ వేదిక్ అకాడమీ అధ్యక్షులు శ్రీ సి.లక్ష్మణరావు, దివ్యసాకేతం అధ్యక్షులు శ్రీ కె.వి.చౌదరి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సజ్జన్ ఇండియా లిమిటెడ్‌లో ఈక్విటీ వాటా మూలధనాన్ని కొనుగోలు చేయడానికి సోనా కంపెనీ పిటిఇ లిమిటెడ్‌ని అనుమతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:కాంపిటీషన్ చట్టం, 2002లోని సెక్షన్ 31 (1) కింద సోనా కంపెనీ పిటిఇ లిమిటెడ్ (కొనుగోలుదారు) సజ్జన్ ఇండియా లిమిటెడ్ (లక్ష్యం)లో ఈక్విటీ మూలధానాన్ని పొందేందుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఆమోదాన్ని తెలిపింది.

లక్ష్యిత సంస్థ ఈక్విటీ షేర్లను కొనుగోలు చేయడం ద్వారా అందులో పెట్టుబడి పెట్టడానికి సంబంధించిన ప్రతిపాదిత కలయిక కాంపిటీషన్ చట్టం, 2002లోని సెక్షన్ 5 (ఎ)కిందకు వస్తుంది.

కొనుగోలుదారు సింగ్‌పూర్ చట్టాల కింద ఏర్పడిన పెట్టుబడి సంస్థ. కొనుగోలుదారుకు భారత్‌లో ఎటువంటి భౌతిక ఉనికి లేదు. నోటీసు తేదీ నాటికి కొనుగోలుదారుకి భారత్‌లో ఎటువంటి పోర్ట్‌ఫోలియో కంపెనీలు లేక పెట్టుబడులు లేవు.

భారత్‌లో లక్ష్యిత సంస్థ కార్యకలాపాలు (1) వ్యవసాయ రసాయనాలలో వినియోగించే రసాయన సమ్మేళనాల తయారీ, కాంట్రక్టుపై తయారీ, (2) ప్రత్యేక రసాయనాల ఉత్పత్తి, వ్యాపారం (3) రంగులు, వర్ణకాలలో ఉపయోగించే రసాయన సమ్మేళనాలు (4) రసాయన సమ్మేళనాలు/ (క్రియాశీలక ఔషదీయ పదార్థాలు కాకుండా) ఔషధ తయారీలో మధ్య రకపు పదార్థాల ఉత్పత్తి (5) రసాయన కారకాల తయారీ.

ఏపీలో తగ్గుముఖం పట్టిన కరోనా

అమరావతి, ఫిబ్రవరి 14: ఏపీలో కరోనా తగ్గుముఖం పడుతోంది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో కొత్తగా 434 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ రోజు నమోదయిన కేసులతో కలిపి ఏపీలో మొత్తం 23,13,212కు పాజిటివ్ కేసులు చేరాయి. 24 గంటల్లో కరోనాతో ఒకరు మృతి చెందారు. ఇప్పటివరకు కరోనాతో 14,698 మంది మృతి చెందారు. ప్రస్తుతం ఏపీలో 14,726 యాక్టివ్ కేసులున్నాయి. ఇప్పటివరకు కరోనా నుంచి 22,83,788 మంది రికవరీ అయ్యారు. కరోనా కేసులు తగ్గుముఖం పట్టినా జాగ్రత్తలు మాత్రం తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. భౌతికదూరం పాటించాలని, కోవిడ్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని చెబుతున్నారు.

రాష్ట్ర ఆయుర్వేద కళాశాలల్లో మూడు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

కరీంనగర్ ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): గౌహతిలోని కేంద్ర ఆయుర్వేద పరిశోధనా సంస్థ లో 20 కోట్ల రూపాయల ఖర్చుతో కొత్తగా మూడు భవనాలను నిర్మించనున్నారు. తొలిసారిగా ఏర్పాటు చేయనున్న ఫార్మకాలజీ మరియు కెమిస్ట్రీ ల్యాబ్ కోసం ఈ భవనాలను నిర్మిస్తారు. ఈశాన్య ప్రాంత రాష్ట్రంలో గౌహతిలో పనిచేస్తున్న రాష్ట్ర ఆయుర్వేద ఫార్మసీ స్థాయిని కూడా అప్‌గ్రేడ్ చేస్తారు.

బోర్సజై లోని కేంద్ర ఆయుర్వేద పరిశోధనా సంస్థ పంచకర్మ బ్లాకును నెలకొల్పేందుకు నిర్మించనున్న భవనానికి కేంద్ర ఆయుష్, రేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ ఈ రోజు శంకుస్థాపన చేశారు. జలుక్‌బరి గువాహటిలోని రాష్ట్ర ఆయుర్వేద కళాశాలలో పంచకర్మ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మాణానికి కూడా మంత్రి శంకుస్థాపన చేశారు. వీటి నిర్మాణానికి 20 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా.

ఈ కార్యక్రమానికి అస్సాం ఆరోగ్య కుటుంబ సంక్షేమం మరియు ఐటీ శాఖ మంత్రి కేశబ్ మహంత , గౌహతి లోక్‌సభ పార్లమెంటు సభ్యుడు క్వీన్ ఓజా కూడా హాజరయ్యారు.

రాష్ట్ర ఆయుర్వేద కళాశాలలో పంచకర్మ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు చేయబడుతుంది. రాష్ట్ర ఆయుర్వేద ఫార్మసీ కూడా ఆయుష్ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ఆయుర్ స్వస్థ యోజన కింద అప్‌గ్రేడ్ చేయబడుతుంది. పంచకర్మ బ్లాక్ జి జి +2 భవనం మరియు ఫార్మకాలజీ కెమిస్ట్రీ లేబొరేటరీస్ జి +3 భవనాలను నిర్మించడం జరుగుతుంది. దీనికి 10 కోట్ల రూపాయలు ఖర్చవుతాయని అంచనా వేశారు.

నూతనంగా ఏర్పాటయ్యే పంచకర్మ కేంద్రంలో పంచకర్మ చికిత్సలో ప్రపంచ స్థాయి ప్రమాణాల మేరకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. కేంద్ర ఫార్మకాలజీ , కెమిస్ట్రీ భవనం ప్రీ-క్లినికల్ ప్రయోగాత్మక విధానాలు, ఔషధాల ప్రమాణీకరణ, మూలికల రసాయన పరీక్ష, జంతు సంబంధిత టాక్సికాలజీ నివేదిక మొదలైన అంశాలతో ఆధునిక సౌకర్యాలతోఆయుర్వేద పరిశోధనా సంస్థ లో కేంద్రాన్ని నెలకొల్పుతారు.

అస్సాం ముఖ్యమంత్రి వ్యాఖ్యానాలు సిగ్గుచేటు

అనుచిత వాక్యలు చేసిన అస్సాం ముఖ్యమంత్రి పై కేసు నమోదు చేసి చర్య తీసుకోవాలి -పీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్ రాజన్న

సిరిసిల్ల, ఫిబ్రవరి 14:(నేటినిజం ప్రతినిధి):పార్లమెంటు సభ్యులు, ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వా శర్మ అనుచిత వ్యాఖ్యలపై

రాష్ట్ర అధ్యక్షుల పిలుపు మేరకు పీసీసీ కార్యదర్శి, వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆది శ్రీనివాస్ మరియు వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి ల ఆధ్వర్యములో పార్లమెంటు సభ్యుడు రాహుల్ గాంధీపై పరువు నష్టం కలిగించే మరియు కించపరిచే ప్రకటనలు చేసిన అస్సాం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ హిమంత బిశ్వ శర్మపై చర్య తీసుకోవాలని వేములవాడ పట్టణ మరియ రురల్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయడం జరిగింది

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ . అస్సాం ముఖ్యమంత్రి శ్రీ హిమంత బిశ్వ శర్మ, 11-02 2022న ఉత్తరాఖండ్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తూ, పార్లమెంటు సభ్యుడు రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా కు భంగం కలిగించే కించపరిచే ప్రకటనలు చేశారని , రాజకీయాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో విమర్శలను స్వాగతిస్తాం కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తే సహించేది లేదని ఖబర్దార్ అంటూ బీజేపీ నేతలను హెచ్చరించారు.దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబం ఇందిరాగాంధీద ని అన్నారు . రాహుల్ గాంధీ కుటుంబం గురించి మాట్లాడే నైతిక అర్హత బిజెపికి ఆ పార్టీకి చెందిన అస్సాం సీఎంకు లేదని అన్నారు దేశం కోసం రాహుల్ గాంధీ కుటుంబ తన ఆస్తులనే త్యాగం చేసిందని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నాగుల విష్ణు ప్రసాద్, సంగే స్వామి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట లహరి, తంగేళ్లి గణేష్, కూరగాయల కొమరయ్య, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు నాగుల రాము గౌడ్, మెండే రాజు, అరుణ్ తేజ చారి, వస్తాది కృష్ణ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా సుష్మా స్వరాజ్ జన్మదిన సందర్భంగా నివాళులు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14:(నేటి నిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేసుకునే సమయంలో కీలక పాత్ర పోషించి తెలంగాణ గురించి గలమెత్తిన మన తెలంగాణ చిన్నమ్మగా పేరు గాంచిన సుష్మస్వరాజ్ జయంతి సందర్భంగా సోమవారం వేములవాడలో రాజన్న సిరిసిల్ల లోబిజెపి ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు సంటి మహేష్ ఆధ్వర్యంలో సుష్మా స్వరాజ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా మోర్చా ఇంచార్జ్ జాడి బాలరెడ్డి . కరీంనగర్ పార్లమెంట్ రాఅ మోర్చా ఇంచార్జ్ మెరుగు పర్శరాములు . కరీంనగర్ రాఅ మోర్చా అధికార ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాస్ . ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మంతుర్తి శ్రీనివాస్ . కౌరంపెల్లి రమేష్ కాదాసు రంజిత్ . పిట్టల నాగరాజు . దామోదర కృష్ణకాంత్ . పెరుమాండ్ల ప్రవీణ్ కొంపెల్లిరాజేందర్. జనగామ లక్ష్మణ్. సుంకరి రమేష్ తదితరులు పాల్గొన్నారు

సంత్ రవి దాస్ బోధనలు స్ఫూర్తిగా తీసుకొని అడుగు జాడలు నడవాలి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14(నేటినిజం ప్రతినిధి):సంత్ రవి దాస్ బోధనలు స్ఫూర్తిగా తీసుకుంటూ ఆయన అడుగుజాడల్లో నడవాలని బిజెపి ఎస్సీ మోర్చా ఇన్చార్జ్ జాడి బాల్ రెడ్డి అన్నారు . తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పిలుపు మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొప్పు బాషా పిలుపు మేరకు కీ శే. సంత్ రవి దాస్ వారిత్సవాలలో భాగంగారాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా జిల్లా ఎస్సీ మోర్చా ఇంచార్జి జాడి బాలరెడ్డి హాజరై అయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సంత్ రవి దాస్ 15.16 వ శతబ్దంలో పుట్టినాడు. కవిత్వం. బోధనలు చేసేవారు. ఉత్తరం భారతదేశంలో అయన అనేక ప్రాంతాలు పర్యటించారు. ఈయన పంజాబ్ రాష్ట్రంలో దళిత సామజిక వర్గానికి చెందిన వారు. కవితలు ఉపదేశాల ద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసారు. అయన తన కుల వృత్తిని జీవితాంతం (మోచి)ఏడిచిపెట్టలేదు. సంత్ రవి దాస్ బోధనలు స్ఫూర్తిగా తీసుకుంటూ అయన అడుగు జాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ ఎస్సీ మోర్చా ఇంచార్జి. మెరుగు పర్శరాంలు . కరీంనగర్ ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి ఎర్రోళ్ల ప్రశాంత్. కరీంనగర్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు నాగుల వెంకటేష్ గౌడ్ . రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంటి మహేష్. ప్రధాన కార్యదర్శి మంతుర్తి శ్రీనివాస్. ఉపాధ్యక్షులు. కౌరం పెల్లి రమేష్. కాదాసు రంజిత్. కకార్యదర్శులు. పిట్టల నాగరాజు. దామోదర కృష్ణకాంత్. సిరిసిల్ల టౌన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు పెరుమాండ్ల ప్రవీణ్. బీజేపి పట్టణ కార్యదర్శి కొంపెల్లి రాజేందర్. మండల అధ్యక్షులు. జనగామ లక్ష్మణ్. సుంకరి రమేష్. తదితరులు పాల్గొన్నారు

అస్సాం ముఖ్యమంత్రి పై కోనరావుపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14(నేటినిజం ప్రతినిధి):ఏఐసీసీ అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీపైన అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బి శ్యా శర్మ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయనపై రాజన్న సిరిసిల్ల కోనరావుపేట మండలం పోలీసు స్టేషన్ లోసోమవారం ఫిర్యాదు చేయడం జరిగింది

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫైరోజ్ పాషా మాట్లాడుతూ అస్సాం ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు రాహుల్ గాంధీ కుటుంబం గురించి మాట్లాడే నైతిక అర్హత బిజెపికి ఆ పార్టీకి చెందిన అస్సాం సీఎంకు లేదని అన్నారు .. ఈ కార్యక్రమంలో కోనరావుపేట మండలం కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా నాయకులు లచ్చయ్య , ప్రదీప్ ఎల్లయ్య యాదవ్ , సత్యం మునీందర్, అశోక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మన ఊరు -మన బడిని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలి : మంత్రి అల్లోల

నిర్మల్ అర్బన్ ఫిబ్రవరి 14 : ప్రభుత్వ పాఠశాలలకు అన్ని హంగులను సమకూరుస్తూ విద్యావ్యవస్థను మరింత పటిష్ట పరిచేందుకు వీలుగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఊరు- మన బడి, మన బస్తీ -మన బడి కార్యక్రమాన్ని చేపట్టింది.

దీనిని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో మన ఊరు- మన బడి కార్యక్రమంపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అయిన కెజి టు పిజి కి అనుగుణంగా అడుగులు ముందుకు పడుతున్నాయి.

ఈ మహత్తర కార్యంలో అందరూ భాగస్వాములై అంకితభావంతో పని చేయాలని కోరారు. తొలి విడతగా 3 వ వంతు పాఠశాలలో మన జిల్లాలో 735 పాఠశాలలకు గాను 260 పాఠశాలలలో మన ఊరు-మన బడి కార్యక్రమం అమలు చేస్తామన్నారు.

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను సమాన నిష్పత్తిలో ఎంపిక చేస్తూ మౌలిక సదుపాయాల కల్పనను మెరుగుపరిచే పనులు, కార్పొరేట్ స్కూళ్లను మరిపించే విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు విద్యాశాఖ, ఇంజినీరింగ్ సమన్వయంతో, ప్రజాప్రతినిధుల సూచనలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు త్వరితగతిన గడువు కాలంలో పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరానికి అందేలా చూడాలన్నారు.

కార్యక్రమంలో అదనపు జిల్లా పరిషత్ జెడ్పీ చైర్ పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి, కలెక్టర్ హేమంత్ బోర్కడే, మున్సిపల్ చైర్మన్ గంప్రత్ ఈశ్వర్, విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ఐటీ, పురపాలక, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి కె. తారకరామారావు సోమవారం ముస్తాబాద్, సిరిసిల్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.

ముందుగా ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామంలో 33 లక్షల రూపాయలతో నిర్మించిన కేసీఆర్ ప్రగతి ప్రాంగణం, అలాగే 1 కోటి రూపాయల అంచనా వ్యయంతో గ్రామంలో నిర్మించనున్న గ్రామ పంచాయితీ భవనంతో పాటు, 15 రకాల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం గూడెం గ్రామంలో 10 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, 30 లక్షల రూపాయలతో ఆధునికీకరించిన మోడల్ అంగన్వాడీ కేంద్రం, 20 లక్షల రూపాయలతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన నాలుగు తరగతి గదులను మంత్రి ప్రారంభించారు. తదనంతరం రామలక్ష్మణపల్లి గ్రామంలో 9 లక్షల 40 వేల రూపాయలతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తరగతి గది, 20 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాన్ని ప్రారంభించారు. అలాగే 10 లక్షల రూపాయలతో గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. చివరగా సిరిసిల్ల పట్టణంలో 1 కోటి 55 లక్షల రూపాయలతో రహదారులు, భవనాల శాఖ విద్యుత్ విభాగం ద్వారా నిర్మించిన కేంద్రీకృత విద్యుత్ దీపాలంకరణను మంత్రి ప్రారంభించారు.

పై కార్యక్రమాల్లో నాఫ్స్కాబ్ చైర్మెన్ కొండూరు రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ రాహుల్ హెగ్డే, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా, జెడ్పీ సీఈఓ గౌతం రెడ్డి, ఆర్ డ బి ఈఈ కిషన్ రావు, పంచాయితీ రాజ్ ఈఈ సూర్య ప్రకాష్, జిల్లా వైద్యాధికారి డా. సుమన్ మోహన్ రావు, డీపీఓ రవీందర్, డీఆర్డీఓ కె. కౌటిల్య, జిల్లా విద్యాధికారి డా. రాధా కిషన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ముస్తాబాద్ ఎంపీపీ శరత్ రావు, జెడ్పీటీసీ నర్సయ్య, ఎంపీడీఓ రమాదేవి, తహశీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, స్థానిక సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

జెఐటిల నిర్మాణంలో పాల్గొంటున్న114 జపాన్ కంపెనీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:భారతదేశంలో అమలు జరుగుతున్న జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ల (జెఐటి) నిర్మాణ ప్రగతిని భారతదేశం పరిశ్రమల, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక మంత్రిత్వ శాఖ (డీపీఐఐటీ) మరియు జపాన్ (ఆర్థిక, వాణిజ్య మరియు పరిశ్రమల) మంత్రిత్వ శాఖ (ఎంఈటిఐ) సంయుక్తంగా సమీక్షించాయి. ఈ టౌన్ షిప్పుల్లో నిర్మాణ కార్యక్రమాలను చేపట్టడానికి అభివృద్ధి చేసిన భూములు, మౌలిక సౌకర్యాలను జపాన్ సంస్థలకు డీపీఐఐటీ, రాష్ట్రాలు అందించాయి. పెట్టుబడులను ఆకర్షించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని జపాన్ సంస్థలను కోరడం జరిగింది.

కోవిడ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ ప్రగతిని ఎంఈటిఐ అధికారులతో డీపీఐఐటీ అధికారులు వర్చువల్ విధానంలో సమీక్షించారు. సమీక్షా సమావేశంలో జపాన్ తరఫున భారతదేశంలో జపాన్ రాయబార కార్యాలయ అధికారులు, జపాన్ విదేశీ వ్యాపార సంస్థ (జెట్రో) ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశం తరఫున కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, టోక్యో లో భారత రాయబార కార్యాలయం అధికారులు, రాష్ట్రాలు,ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధులు సమీక్షా సమావేశానికి హాజరయ్యారు.

భాతదేశంలో జపాన్ మాత్రమే పారిశ్రామిక టౌన్‌షిప్‌ల నిర్మాణాన్ని చేపట్టింది. జపాన్ పారిశ్రామిక టౌన్‌షిప్‌లలో అనేక సౌకర్యాలను కల్పించడం జరుగుతుంది. అనువాదం మరియు సులభతర సహకారం కోసం ప్రత్యేక జపాన్ డెస్క్‌లు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల సౌకర్యాలు, ప్లగ్ మరియు ప్లే సౌకర్యాలు, రెసిడెన్షియల్ క్లస్టర్‌లు మరియు జపనీస్ కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు వంటి సౌకర్యాలను వీటిలో అందిస్తారు. పూర్తిగా అభివృద్ధి చెందిన భూమి ఈ టౌన్‌షిప్‌లలో కేటాయింపు కోసం అన్ని సౌకర్యాలతో కల్పించారు. వీటిని వెంటనే స్వాధీనం చేసుకునేందుకు వీలుగా అభివృద్ధి చేయడం జరిగింది.

దేశంలో ప్రస్తుతం జపాన్ చెందిన 114 సంస్థలు వివిధ జెఐటిలలో పనిచేస్తున్నాయి. నీమ్రానా మరియు శ్రీ సిటీ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లు ఎక్కువ జపాన్ సంస్థలు ఉన్నాయి. డైకిన్, ఇసుజు,కొబల్క యమహా మ్యూజిక్, హిటాచి ఆటోమోటివ్ మొదలైన సంస్థలు ఈ టౌన్‌షిప్‌లలో ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాయి. జపాన్ పెట్టుబడిదారులు వీటిలో పెట్టుబడులు పెట్టారు.

భారతదేశంలో 5వ అతిపెద్ద పెట్టుబడిదారుగా గుర్తింపు పొందిన జపాన్ 2000 నుంచి ఇంతవరకు భారతదేశంలో 36.2 బిలియన్ అమెరికా డాలర్ల విలువ చేసే పెట్టుబడులను పెట్టింది. ముఖ్యంగా ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ , మ్యానుఫ్యాక్చరింగ్ (ఖూఆఓ), వైద్య పరికరాలు,వినియోగ వస్తువులు, టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు కెమికల్స్ వంటి కీలక రంగాల్లో జపాన్ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి.

భారతదేశంలో పెట్టుబడులను ఆకర్షించడానికి మరియు సులభతరమైన వ్యాపారాన్ని మెరుగుపరచడానికి భారత ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను అధికారులు సమావేశంలో వివరించారు. 14 రంగాల కోసం ప్రకటించిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం అనేక దరఖాస్తులు అందాయని భారత అధికారులు తెలిపారు. ఈ పథకం కింద అనేక జపాన్ సంస్థలు దరఖాస్తు చేశాయని, వీటికి ఆమోదం లభించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సింగిల్ విండో విధానం వివరాలు, పథకం ప్రయోజనాలను జపాన్ బృందానికి భారతదేశ అధికారులు వివరించారు. ఏక గవాక్ష విధానంలో డిజిటల్ పద్ధతిలో 20 కేంద్ర మంత్రిత్వ శాఖలు, 14 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలలో అమలు జరుగుతోంది. నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ కార్యక్రమం కింద ఇంధనం, రైల్వేలు, రహదారులు, నీటిపారుదల లాంటి ముఖ్యమైన రంగాలలో మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. 2019-2025 మధ్య ఈ కార్యక్రమాన్ని 1.4 ట్రిలియన్ అమెరికా డాలర్ల విలువ చేసే పనులను ఈ కార్యక్రమం కింద అమలు చేయడం జరుగుతుంది.

జెఐటి వంటి ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను భారత అధికారులు వివరించారు. జెఐటి తో సహా ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, రెన్యూవబుల్ ఎనర్జీ, విద్యుత్ వాహనాల తయారీ , డ్రోన్స్, రోబోటిక్స్ మరియు జౌళి రంగాలలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. భారతదేశం తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జపాన్ బృందం తెలిపింది. భారతదేశం తో సహకారం- జపాన్ పారిశ్రామిక పోటీ భాగస్వామ్యం' ఒప్పందం ద్వారా రెండు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక సంబంధాలు మరింత మెరుగు పడతాయని జపాన్ బృందం పేర్కొంది.

గరిష్ట స్థాయికి చేరిన షాలోట్స్ ఎగుమతులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:భారతదేశ షాలోట్స్ ఎగుమతి 2013 నుండి 487% వృద్ధిని సాధించింది. 2013 ఏప్రిల్-డిసెంబర్‌లో ఎగుమతులు 2 మిలియన్ల అమెరికన్ డాలర్లు ఉండగా నుండి 2021 ఏప్రిల్-డిసెంబర్ లో అవి 11.6 యూఎస్‌డీ మిలియన్లకు పెరిగాయి.

ఏప్రిల్-డిసెంబర్ 2021లో ప్రధాన ఎగుమతి గమ్యస్థానాలు శ్రీలంక (35.9%), మలేషియా (29.4%), థాయిలాండ్ (12%), యు అరబ్ ఇ (7.5%) ఎ సింగపూర్ (5.8%).

భారతదేశం యొక్క పైనాపిల్ ఎగుమతి కూడా ఏప్రిల్-డిసెంబర్ 2013లో యూఎస్‌డీ 1.63 మిలియన్లతో పోలిస్తే ఏప్రిల్-డిసెంబర్ 2021లో దాదాపు 100% పెరిగి యూఎస్‌డి 3.26 మిలియన్లకు చేరుకుంది.

ఏప్రిల్-డిసెంబర్ 2021లో పైనాపిల్ ప్రధాన ఎగుమతి గమ్యస్థానాలు యూఏఈ (32.2%), నేపాల్ (22.7%), ఖతార్ (16.6%), మాల్దీవులు (13.2%) మరియు యూఎస్ఏ (7.1%).

భారతదేశం ఎగుమతుల్లో స్థిరమైన వృద్ధిని సాధిస్తోంది. జనవరి 2021లో భారతదేశ సరుకుల ఎగుమతి యూఎస్‌డి 27.54 బిలియన్లు ఉంటే అది జనవరి 2022లో 23.69% పెరిగి యూఎస్‌డి 34.06 బిలియన్లకు చేరిందని గమనించవచ్చు; జనవరి 2020లో యూఎస్‌డి 25.85 బిలియన్ల కంటే 31.75% పెరుగుదలను నమోదు చేసింది.

2021-22 (ఏప్రిల్-జనవరి)లో భారతదేశ సరుకుల ఎగుమతి 2020-21 (ఏప్రిల్-జనవరి)లో యూఎస్‌డి 228.9 బిలియన్ల కంటే 46.53% పెరిగి యూఎస్‌డి 335.44 బిలియన్లకు చేరుకుంది; 2019-20 (ఏప్రిల్-జనవరి)లో యూఎస్‌డి 264.13 బిలియన్ల కంటే 27.0% పెరుగుదలను సూచిస్తుంది.

ఎగుమతులను పెంచేందుకు ప్రభుత్వం అనేక చురుకైన చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా మహమ్మారి సమయంలో ఎగుమతి రంగం ఎదుర్కొంటున్న అవరోధాలు, అడ్డంకులు మరియు ఇబ్బందులను తొలగించడంలో సహాయపడటానికి ఎగుమతి పర్యవేక్షణ డెస్క్ ఏర్పాటు చేయబడింది.

రిడెండెన్సీలు మరియు కాలం చెల్లిన నిబంధనలను తొలగించడానికి వాణిజ్య శాఖ ఆధ్వర్యంలోని వివిధ చట్టాలు సమీక్షించబడుతున్నాయి.

అనేక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కొనసాగిస్తున్నారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఓడిఓపీ) వంటి కార్యక్రమాల ద్వారా భారతదేశంలోని ప్రతి జిల్లాను ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. మొదటి మరియు చివరి మైలు కనెక్టివిటీ సమస్యలను పరిష్కరించడానికి పేలోడ్ మోసే డ్రోన్‌లను ఉపయోగించడం వంటి వినూత్న చర్యలు తీసుకోబడుతున్నాయి.

రేషనలైజేషన్ మరియు డీక్రిమినలైజేషన్ ద్వారా సమ్మతి భారాన్ని తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి మరియు వ్యాపారాన్ని సులభతరం చేయడానికి అనేక కార్యక్రమాలు చేపట్టబడుతున్నాయి.

వివిధ ఎగుమతిదారుల-ఆధారిత పథకాల ద్వారా ఎగుమతిదారులకు మద్దతు కూడా అందించబడుతోంది.

విశ్వసనీయ సరఫరాదారుగా భారతదేశం యొక్క గ్లోబల్ స్టాండింగ్‌ను మెరుగుపరచడానికి భారత ఎగుమతుల బ్రాండింగ్ విలువను పెంపొందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది మరియు ప్రపంచ విలువ గొలుసుతో దేశాన్ని సమం చేయడానికి చురుకైన చర్యలు చేపట్టడం జరిగింది.

ఎగుమతిదారులకు లైసెన్సింగ్ అందించడానికి మరియు వారి ఫిర్యాదులను పరిష్కరించడానికి ఐటీ ఆధారిత ప్లాట్‌ఫారమ్ కూడా పనిలో ఉంది.

హనుమాన్ జంక్షన్ అంజనేయ స్వామి దేవస్థానంలో చోరీ

విజయవాడ, ఫిబ్రవరి 14:: హనుమాన్ జంక్షన్ అంజనేయ స్వామి దేవస్థానంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. 23 కేజీల బంగారం, 100 కేజీల వెండి అపహరణకు గురయినట్లు అధికారులు సమాచారం. బంగారం, వెండి మాయంపై అధికారులు అరా తీస్తున్నారు. ఇంకా దేవాదాయ శాఖ ధృవీకరించలేదు. మాజీ ఈ.ఓ, ప్రస్తుత ఆర్.జె.సి సురేష్ బాబు దర్యాప్తు జరుపుతున్నారు. ఆభరణాలు యధాతథంగా ఉన్నాయని సురేష్ బాబు వెల్లడించినట్లు తెలిసింది.

మోదీకి ఇతరులను గౌరవించే స్వభావం లేదు: వినోద్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 14:ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఇతరులను గౌరవించే స్వభావం లేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తప్పుబట్టారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కరోనా సమయంలో వ్యాక్సిన్ పరిశీలనకు ప్రధాని హైదరాబాద్‌కు వచ్చారని, సీఎం కేసీఆర్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్‌కు ఎక్కడ గుర్తింపు వస్తుందోనని మోదీకి భయం పట్టుకుందన్నారు. అధికారం ఇప్పట్లో వచ్చేలా కనిపించక పోవడంతో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల్లో నిరాశ అలుముకుందని ఎద్దేవాచేశారు. తెలంగాణ అభివృద్ధి కోసమే గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులకు మద్దతు ఇచ్చామని తెలిపారు. పేదప్రజలకు సీఎం అండగా ఉంటున్నందుకు జైలుకు పంపుతారా? అని బీజేపీ నాయకులను ప్రశ్నించారు. కేంద్రం తెచ్చే విద్యుత్ సంస్కరణలను తీవ్రంగా ఖండిస్తున్నామని వినోద్‌కుమార్ ప్రకటించారు.

మాంచెస్టర్ యునైటెడ్ భారతీయ అభిమానులు ఐ లవ్ యునైటెడ్ తదుపరి గమ్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 14: ఇంటరాక్టివ్ వర్చువల్ ఈవెంట్ తదుపరి లైవ్ లవ్ యునైటెడ్ ఈవెంట్‌ను ఏ భారతీయ నగరం నిర్వహించాలో నిర్ణయించుకునే శక్తిని అభిమానులకు అందిస్తుంది. ప్రపంచ కప్ విజేతలు పాల్ పోగ్బా మరియు జోఫ్రా ఆర్చర్ ప్రత్యేక లోతైన చర్చ కోసం ఏకమయ్యారు. స్కాట్ మెక్‌టోమినే యునైటెడ్ ప్లేయర్ యొక్క 'డే ఇన్ ది లైఫ్' కోసం అభిమానులను తెర వెనుకకు తీసుకువెళతాడు. లైవ్ ఈవెంట్‌లో చేరిన స్టార్ పేర్ల హోస్ట్‌లో క్రికెట్ ఐకాన్ యువరాజ్ సింగ్ మాంచెస్టర్ యునైటెడ్ యొక్క ప్రసిద్ధ అభిమానుల ఈవెంట్, ఐఐ లవ్ యునైటెడ్ దాని ఏడవ సీజన్‌కు తిరిగి వస్తుంది మరియు భవిష్యత్ ఈవెంట్ గమ్యస్థానాల ఎంపికను అభిమానుల చేతుల్లో ఉంచుతుంది. అంతర్జాతీయ ప్రయాణంపై కొనసాగుతున్న ఆంక్షలు అంటే ఈవెంట్ యొక్క తాజా ఎడిషన్, భారతదేశంలోని క్లబ్ యొక్క ఉద్దేగభరితమైన అభిమానుల స్థావరానికి సేవ చేయడానికి మరియు జరుపుకోవడానికి అంకితం చేయబడింది, ఇది ఇంటరాక్టివ్ వర్చువల్ అనుభవం రూపంలో ఉంటుంది., ఫిబ్రవరి 20 ఆదివారం లీడ్స్ యునైటెడ్‌తో కీలక ప్రీమియర్ లీగ్ సమావేశానికి ముందు 90 నిమిషాల ప్రీ-మ్యాచ్ షోలో భాగంగా, అభిమానులు తదుపరిసారి ఈవెంట్‌ను ఏ నగరంలో నిర్వహించాలనే దానిపై ఓటు వేసే అవకాశం ఇవ్వబడుతుంది. భారతదేశంలో నేల.యునైటెడ్ యొక్క ప్రధాన షర్ట్ భాగస్వామి టీమ్‌వ్యూయర్ సహాయంతో భారతదేశం అంతటా ఆరుగురు అభిమానులు ఈవెంట్ యొక్క మొట్టమొదటి 'ఫ్యాన్ ప్యానెల్'లో ప్రతినిధులుగా తమ నగరానికి సంబంధించిన కేసును రూపొందించారు మరియు క్లబ్ యొక్క అధికారిక యాప్‌లో తమ అభిమానానికి ఓటు వేయమని ప్రేక్షకులు ఆహ్వానించబడతారు. కోల్‌కతా, న్యూఢిల్లీ, ముంబై, హైదరాబాద్, చెన్నై మరియు బెంగళూరు తదుపరి ఈవెంట్‌ను నిర్వహించడానికి పోటీపడుతున్న నగరాలు. మాంచెస్టర్ యునైటెడ్ యొక్క వెబ్, యాప్ మరియు ఎమ్ యు టివి ఛానెల్, ఫేస్‌బుక్, యూట్యూబ్, లో ప్రపంచవ్యాప్తంగా ప్రసారం చేయబడినందున - ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ప్రదర్శనను ఆస్వాదించగలరు. తాజా ఎడిషన్‌లో భారతదేశంలోని క్లబ్ అభిమానులను ఉద్దేశించి బెస్పోక్ స్థానిక కంటెంట్‌ను కలిగి ఉంటుంది మరియు మొదటి జట్టుకు సంబంధించిన ప్రత్యేకమైన తెరవెనుక యాక్సెస్ మరియ